మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక www.evarthalu.com
PRGI REGD NO: TGTEL/25/A1385

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 10-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 250 Issue: 250

10 మార్చి 2026 - మంగళవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:31 సూర్యాస్తమయం - సా. 6:21 తిథి సప్తమి రా. 1:550 వరకు తరువాత అష్టమి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం అనురాధ సా. 6:58 వరకు తరువాత జ్యేష్ఠ యోగం హర్షణ ఉ. 8:16 వరకు కరణం విష్టి మ. 12:40 వరకు బవ రా. 1:550 వరకు వర్జ్యం రా. 1:22 నుండి తె. 3:10 వరకు దుర్ముహూర్తం ఉ. 8:53 నుండి ఉ. 9:40 వరకు రా. 11:13 నుండి రా. 12:01 వరకు రాహుకాలం మ. 3:23 నుండి సా. 4:52 వరకు యమగండం ఉ. 9:29 నుండి ఉ. 10:57 వరకు గుళికకాలం మ. 12:26 నుండి మ. 1:55 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:55 నుండి తె. 5:43 వరకు అమృత ఘడియలు ఉ. 7:25 నుండి ఉ. 9:13 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:02 నుండి మ. 12:50 వరకు

Published from Jagitial
Circulated to Telangana





# గ్యాస్ బుకింగ్‌కు 'అడ్డుకట్ట'!

## 25 రోజుల వ్యవధి విధింపు

న్యూఢిల్లీ: ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో చమురు, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్ ను నివారించడానికి, సిలిండర్లను న్యాయబద్ధంగా అందించడానికి భారత ప్రభుత్వం ఎల్పీజీ బుకింగ్ వ్యవధిని 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచుతూ కీలక నిర్ణయం తీసుకున్నది. పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో సిలిండర్ల కొరత ఏర్పడుతుందనే భయంతో చాలామంది తరువాయి 2 వ పేజీలో...



# 'కమర్షియల్'కు కటకట!

వంటగ్యాస్ సరఫరాలో ఏర్పడిన ఆకస్మిక అంతరాయం బెంగళూరు నగరంలోని హోటళ్లను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాలో అంతరాయం కారణంగా 'బెంగళూరు హోటల్స్ అసోసియేషన్' సోమవారం కీలక ప్రకటన చేసింది.

# బెంగళూరులో హోటళ్లు బంద్!?

బెంగళూరు: నగరంలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిచిపోతుండడంతో మంగళవారం బెంగళూరులోని హోటళ్లు మూతపడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. దీంతో రోజువారీ ఆహారం కోసం హోటళ్లపై ఆధారపడే వేలాది మంది విద్యార్థులు, ఐటీ నిపుణులు, సీనియర్ సిటిజన్లు, వైద్య సిబ్బందిపై తీవ్ర ప్రభావం పడనుంది. గతంలో చమురు కంపెనీలు తరువాయి 2 వ పేజీలో...



# మండే బ్లడ్ బాత్

## దలాల్ స్ట్రీట్‌లో దడదడ.. సెన్సెక్స్ 2000 పాయింట్లు పతనం

### భారీగా పెరిగిన ముడిచమురు ధర.. రికార్డు స్థాయి కనిష్టానికి రూపాయి

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో భారత స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ నష్టాలతో ప్రారంభమయ్యాయి. ఇన్వెస్టర్లు అమ్మకాలకు తెగబడటంతో ట్రేడింగ్ మొదలైన కొద్దిసేపటికే బీఎస్ఈ సెన్సెక్స్ 2000 పాయింట్లకు పైగా కుప్పకూలింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా కీలకమైన 24,000 మార్కును కోల్పోయి దిగువకు పడిపోయింది. దీంతో దలాల్ స్ట్రీట్‌లో ఒక్కసారిగా ఆందోళన వాతావరణం నెలకొంది.

ముంబై: అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర ఏకంగా 20 శాతానికి పైగా పెరిగి బ్యారెల్‌కు 114 డాలర్ల స్థాయిని దాటింది. భారత్ తన చమురు అవసరాల్లో దాదాపు 88 శాతం దిగుమతులపైనే ఆధారపడుతుంది. ఈ నేపథ్యంలో, పెరిగిన చమురు ధరలు దేశంలో ద్రవ్యోల్బణాన్ని పెంచుతాయనే భయాలు ఇన్వెస్టర్లలో మొదలయ్యాయి. దీంతో విదేశీ, స్వదేశీ సంస్థాగత మదుపరులు తమ పెట్టుబడులను వెనక్కి తరువాయి 2 వ పేజీలో...



# అప్పుల సాగు


## రుణాల ఊబిలో అన్నదాతలు..టాప్‌లో తమిళనాడు, ఏపీ రైతులు

### 7వ స్థానంలో తెలంగాణ కర్షకులు.. లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం వెల్లడి

దేశవ్యాప్తంగా అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోయినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తమిళనాడుకు చెందిన డీఎంకే ఎంపీ పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు.

**తెలంగాణ**
పంట రుణాలు: 95,167 కోట్లు
టర్మ్ లోన్స్: 80,792 కోట్లు
మొత్తం: 1,75,959 కోట్లు


న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రైతులపై మొత్తం రూ. 31,34,807 కోట్ల వ్యవసాయ రుణాలు ఉన్నాయి. ఇందులో పంట సాగు కోసం తీసుకున్న స్వల్పకాలిక రుణాలు రూ. 16,34,219 కోట్లుగా ఉండగా.. వ్యవసాయ అనుబంధ పనులు యంత్రాల కొనుగోలు కోసం తీసుకున్న టర్మ్ లోన్స్ రూ. 15,00,588 కోట్లుగా తరువాయి 2 వ పేజీలో...




**రాష్ట్రాల వారీగా రుణాలు ఉన్న రాష్ట్రాలు**

| | |
|---|---|
| తమిళనాడు: | రూ.5,06,290 కోట్లు |
| ఆంధ్రప్రదేశ్: | రూ.3,75,254 కోట్లు |
| మహారాష్ట్ర: | రూ.3,07,293 కోట్లు |
| ఉత్తరప్రదేశ్: | రూ.2,30,096 కోట్లు |
| కర్ణాటక: | రూ.2,10,244 కోట్లు |
| రాజస్థాన్: | రూ.1,92,293 కోట్లు |
| తెలంగాణ: | రూ.1,75,960 కోట్లు |
| మధ్యప్రదేశ్: | రూ.1,70,757 కోట్లు |
| గుజరాత్: | రూ.1,68,460 కోట్లు |
| కేరళ: | రూ.1,61,023 కోట్లు |

**ఆంధ్రప్రదేశ్**
పంట రుణాలు: రూ.2,01,744 కోట్లు
టర్మ్ లోన్స్: రూ.1,73,510 కోట్లు
మొత్తం: రూ.3,75,254 కోట్లు



# 13న మోదీ పైసలు!?

## రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ డబ్బులు పడే చాన్స్

న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పీఎం కిసాన్ యోజన విషయంలో అతి త్వరలోనే కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇందులో భాగంగా పీఎం కిసాన్ యోజన 22వ విడత డబ్బులను అతి త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేసే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా తాజా సమాచారం ప్రకారం మార్చి 13వ తేదీన పీఎం కిసాన్ యోజన -2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,364 |
| వెండి (గ్రాము): | రూ.290 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,340 |

# మోదీకే ఆ సత్తా

## ఫోన్ చేస్తే యుద్ధం ఆగుతుంది: యూఏఈ రాయబారి




పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలను తొలగించే శక్తి కేవలం భారత ప్రధాని నరేంద్ర మోదీకి మాత్రమే ఉందని భారత్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాయబారి అబ్దుల్ నజీర్ హుస్సేన్ అల్ జెనబీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల నేతలకు ప్రధాని మోదీ ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలని, ఈ యుద్ధం వెంటనే ఆగిపోయే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

న్యూఢిల్లీ: గల్ఫ్ దేశాల నేతల్లోనే కాకుండా, అక్కడి ప్రజలు, వ్యాపార వర్గాల్లోనూ మోదీ పట్ల అపారమైన గౌరవం ఉందని గుర్తు చేశారు. ఇక, యుద్ధం విషయంలో యూఏఈ తన స్పష్టమైన వైఖరిని ప్రకటించింది. తాము నేరుగా యుద్ధంలోకి దిగే ఆలోచన లేదని, అలాగే తమ భూభాగాన్ని ఏ దేశం కూడా మరొక దేశంపై దాడి చేయడానికి 'లాంచింగ్ ప్యాడ్'గా వాడుకోవడానికి అంగీకరించబోమని రాయబారి స్పష్టం చేశారు. ఇరాన్ తమ పొరుగు దేశమని, అదే సమయంలో ఇజ్రాయెల్ తమ మిత్రపక్షమని పేర్కొన్న తరువాయి 2 వ పేజీలో...

# ఇరాన్‌కే మా మద్దతు

## రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మొజ్తబా ఖమేనీకి మద్దతు ప్రకటించారు. కొన్ని రోజుల క్రితం అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో అలీ ఖమేనీ మరణించారు. అలీ ఖమేనీ కుమారుడే మొజ్తబా ఖమేనీ. మొజ్తబాకు పుతిన్ ఓ సందేశం పంపారు.



మాస్కో: 'ఇరాన్‌కు మా సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాం. ఇరాన్‌లోని మిత్రులతో ఐక్యంగా ఉంటాం. ఇరాన్‌కు రష్యా విశ్వసనీయ భాగస్వామిగా ఉంది. భవిష్యత్తులోనూ ఇలాగే ఉంటుంది. ఇరాన్ దాడులను ఎదుర్కొంటున్న ఈ సమయంలో మీ పదవీకాలంలో మీకు చాలా ధైర్యం, అంకితభావం అవసరం' అని తెలిపారు. తాజాగా, డొనాల్డ్ ట్రంప్ చేసిన కామెంట్లకు పుతిన్ వ్యాఖ్యలు పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయి. ఓ ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఖమేనీ కుమారుడు ఉండడం తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



చిన్న పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ ముగ్గురికి చైనా ఉరిశిక్ష విధించింది. చిన్న పిల్లలపై లైంగిక వేధింపులను అస్సలు సహించేది లేదన్న సందేశాన్ని ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చైనా పీపుల్స్ కోర్టు పేర్కొంది. నిందితుల్లో ఒకడు ప్రైమరీ స్కూల్ టీచర్ కాగా, ఆరుగురు మైనర్ విద్యార్థులను 100 సార్లకు పైగా లైంగికంగా వేధించినట్లు తేలింది.



# టార్గెట్ ఒలింపిక్స్

## అంతర్జాతీయ క్రీడలే లక్ష్యంగా శిక్షణ

### యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీపై సీఎం సమీక్ష

ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా తెలంగాణలో అన్ని సౌకర్యాలతో పాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణాలు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఒలింపిక్స్, కామన్‌వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యమిచ్చేలా, ఒలంపిక్స్‌లో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటడమే లక్ష్యంగా క్రీడా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు.

హైదరాబాద్, మార్చి 9 (ఈవార్తలు): క్రీడలకు అవసరమైన మైదానాలు, యూనివర్సిటీ, శిక్షణ తదితర అంశాలపై జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో క్రీడాశాఖకు సంబంధించి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తరువాయి 2 వ పేజీలో...

# బ్యాంకులకు 50,000 కోట్లు

## విడుదల చేసిన రిజర్వ్ బ్యాంక్

### ఓఎంఓ ద్వారా ప్రభుత్వ బాండ్ల కొనుగోలు.. జీఎస్టీ చెల్లింపుల నేపథ్యంలో చర్యలు

దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు లభ్యతను పెంచే దిశగా ఆర్బీఐ సోమవారం కీలక చర్యలు చేపట్టింది. ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ (ఓఎంఓ) ద్వారా మార్కెట్‌లోని ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేసి ఏకంగా రూ.50,000 కోట్లను బ్యాంకింగ్ సిస్టమ్‌లోకి ప్రవేశపెట్టింది. ఈ నెలాఖరులో భారీగా అడ్వాన్స్ టాక్స్ (ముందస్తు పన్ను) చెల్లింపులతో పాటు జీఎస్టీ వసూళ్లు జరగనున్నాయి.




న్యూఢిల్లీ: దీని వల్ల బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి పెద్ద ఎత్తున నిధులు బయటకు వెళ్లే అవకాశం ఉంది. ఈ సమయంలో నగదు లభ్యతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకే ఆర్బీఐ ముందుజాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా వేర్వేరు కాలపరిమితులు ఉన్న పలు ప్రభుత్వ బాండ్లను సెంట్రల్ బ్యాంక్ కొనుగోలు -2 వ పేజీలో...

# రాశి ఫలాలు



10.3.2026

మేషం: చేపట్టిన పనులలో శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. వృత్తి వ్యాపారాలు లాభాల బాట పడతాయి. సన్నిహితుల నుండి నూతన విషయాలు తెలుసుకుంటారు. ఉద్యోగమున అనుకూలత పెరుగుతుంది. ఆర్థిక విషయాలు సంతృప్తికరంగా సాగుతాయి. సమాజంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి.

వృషభం: ప్రముఖుల నుండి ఊహించని ఆహ్వానాలు అందుతాయి. గృహమున బంధు మిత్రుల రాకతో సందడి వాతావరణం ఉంటుంది. అనుకున్న పనులు సకాలంలో పూర్తవుతాయి. స్థిరస్థి వృద్ధి చెందుతుంది. వృత్తి వ్యాపారాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. నిరుద్యోగులకు ఉద్యోగ లబ్ది పొందుతారు.

మిధునం: బంధువులతో కొన్ని విషయాల్లో మాట పట్టింపులు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. కీలక వ్యవహారాలలో అవాంతరాలు కలుగుతాయి. వృధా ఖర్చులు చేస్తారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగస్తులు అధికారుల ఆగ్రహానికి గురవుతారు. ఋణ ప్రయత్నాలు కలసిరావు.

కర్కాటకం: దూర ప్రయాణాలలో ఇబ్బందులు కలుగుతాయి.నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు కలుగుతాయి. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. జీవిత భాగస్వామి ఆరోగ్య విషయాల్లో శ్రద్ధ వహించాలి. ధన వ్యవహారాలు నిరాశ కలిగిస్తాయి.

సింహం: పాత మిత్రుల సహాయంతో కొన్ని వ్యవహారాలు పూర్తి చేస్తారు. కుటుంబ సభ్యులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. సంతాన నూతన విద్యా ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారాలలో స్వంత నిర్ణయాలు చెయ్యడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు.

కన్య: చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో పెట్టుబడులు సకాలంలో అందవు. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. కుటుంబ సభ్యులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగాలలో ఇతరులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. నూతన ఋణాలు చెయ్యకపోవడం మంచిది.

తుల: చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. కొన్ని వ్యవహారాలలో ఆప్తుల సలహాలు తీసుకోవడం మంచిది. ఉద్యోగస్థులకు శుభవార్తలు అందుతాయి. స్థిరాస్తి క్రయ విక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. ఉద్యోగస్తులకు పదోన్నతులు పెరుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

వృశ్చికం: దైవ సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వృత్తి వ్యాపారాలలో ఆర్థిక నష్టాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో అవరోధాలు కలిగిన సకాలంలో పూర్తిచేస్తారు. ఇంటా బయట పని ఒత్తిడి పెరిగి సమయానికి తగిన విశ్రాంతి ఉండదు. ప్రభుత్వ వ్యవహారాలలో విమర్శలు ఎదురవుతాయి.

ధనస్సు: ఆర్థికంగా గందరగోళ పరిస్థితులుంటాయి. బంధు మిత్రుల ఆదరణ పెరుగుతుంది. గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు చేస్తారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వృత్తి వ్యాపారాలలో మరింత ఉత్సాహకర వాతావరణం ఉంటుంది. ఉద్యోగస్తులు పనితీరుతో అందరిని ఆకట్టుకుంటారు.

మకరం: సోదరులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు విస్తృతమౌతాయి. వ్యాపార ఉద్యోగాలలో సమస్యలను అధిగమించి ధైర్యంగా ముందుకు సాగుతారు. చాలకాలంగా పూర్తి కానీ పనులు సకాలంలో పూర్తి చేస్తారు. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

కుంభం: నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు కలుగుతాయి. ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు పెరుగుతాయి. కీలక వ్యవహారాలలో కుటుంబ సభ్యులు మీ మాటతో విభేదిస్తారు. మిత్రులతో చిన్నపాటి వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తి కాక నిరాశ తప్పదు.

మీనం: కుటుంబ సభ్యులతో మాట పట్టింపులుంటాయి. చేపట్టిన పనులు మరింత మందకొడిగా సాగుతాయి. దూర ప్రయాణాలు ఆకస్మికంగా వాయిదా పడుతాయి. వృత్తి ఉద్యోగాలలో సహోద్యోగుల ప్రవర్తన కొంత మానసిక బాధ కలిగిస్తుంది. నూతన వ్యాపారాల ప్రారంభానికి చేసే ప్రయత్నాలు విఫలమౌతాయి.



# టార్గెట్ ఒలింపిక్స్: సీఎం

మొదటి పేజీ తరువాయి

యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పన.. అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని రకాల క్రీడలకు అనువుగా మైదానాల ఏర్పాటుపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఒలింపిక్స్, కామన్‌వెల్త్ గేమ్స్ లక్ష్యంగా తెలంగాణలోని క్రీడాకారులకు ట్రైనింగ్ ఇచ్చేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఔట్ డోర్ స్టేడియం పునరుద్ధరణతో పాటు ఇండోర్ స్టేడియం.. యూనివర్సిటీ కాంప్లెక్స్.. హాస్టల్ భవనాలు, అన్ని రకాల క్రీడా మైదానాలు.. శిక్షణకు అవసరమైన ఇతర సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా స్పోర్ట్స్ యూనివర్సిటీకి సంబంధించిన నిర్మాణాల డిజైన్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు ప్రతిభ చూపించేలా వారికి సరైన శిక్షణ ఇవ్వాలని.. దానికి అవసరమైన అన్ని సౌకర్యాలతో స్పోర్ట్స్ వర్సిటీని రెడీ చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. స్పోర్ట్స్ యూనివర్సిటీకి సంబంధించి ప్రతిపాదిత నిర్మాణాల పలు ఆర్కిటెక్చర్ నమూనాలను సీఎం పరిశీలించారు.భవిష్యత్తులో ఒలింపిక్స్, కామన్వెల్త్ వంటి ఇంటర్నేషనల్ మెగా ఈవెంట్లకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎం రేవంత్ సూచించారు. ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటేలా వారిని తీర్చిదిద్దాలని ఆదేశించారు. భవిష్యత్ అవసరాల కోసం కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం.. ఎల్బీ స్టేడియం.. సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలను ఆధునీకరించాలని పేర్కొన్నారు. సమీక్షలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ (శాట్) చైర్మన్ శివసేనా రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అప్పుల సాగు



మొదటి పేజీ తరువాయి

నమోదయ్యాయి. వ్యవసాయ రుణాల్లో దక్షిణాది రాష్ట్రాల వాటా భారీగా ఉండటం గమనార్హం. దేశం మొత్తం మీద తమిళనాడు అత్యధికంగా రూ. 5,06,290 కోట్ల రుణాలతో తొలి స్థానంలో నిలిచింది. తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ రూ. 3,75,254 కోట్ల అప్పులతో దేశంలోనే రెండో స్థానంలో ఉంది. మహారాష్ట్ర రూ. 3,07,293 కోట్లతో మూడో స్థానంలో నిలవగా.. ఉత్తరప్రదేశ్ కర్ణాటక రాజస్థాన్ వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచాయి. తెలంగాణ రూ. 1,75,960 కోట్ల రుణభారంతో దేశంలో ఏడో స్థానంలో ఉంది. గత కొన్ని ఏళ్లుగా పెరుగుతున్న పెట్టుబడి వ్యయం సాగులో వస్తున్న నష్టాలు రైతులను రుణాల వైపు మళ్లిస్తున్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల రుణాల గణాంకాలు చూస్తే ఆంధ్రప్రదేశ్ రైతులపై భారం అధికంగా కనిపిస్తోంది.

ఏపీలో పంట రుణాలు రూ. 2,01,744 కోట్లుగా ఉండగా.. టర్మ్ లోన్స్ రూ. 1,73,510 కోట్లుగా ఉన్నాయి. మొత్తం రూ. 3,75,254 కోట్ల రుణాలతో ఏపీ రైతులు దేశంలోనే రెండో అత్యధిక రుణగ్రస్తులుగా మిగిలారు. మరోవైపు, తెలంగాణలో పంట రుణాలు రూ. 95,167 కోట్లుగా నమోదు కాగా.. టర్మ్ లోన్స్ రూ. 80,792 కోట్లుగా ఉన్నాయి. మొత్తం రూ. 1,75,960 కోట్లతో తెలంగాణ ఏడో స్థానంలో నిలిచింది. ఉమ్మడి రాష్ట్రం విడిపోయిన తర్వాత రెండు రాష్ట్రాల్లోనూ సాగు విస్తీర్ణం పెరిగినప్పటికీ రుణాల పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. కేంద్రం వెల్లడించిన ఈ టాప్ 10 జాబితాలో గుజరాత్ రూ. 1,68,460 కోట్లు కేరళ రూ. 1,61,023 కోట్లు మధ్యప్రదేశ్ రూ. 1,70,757 కోట్ల రుణాలతో నిలిచాయి. ప్రభుత్వాలు ఎన్ని రుణమాఫీ పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ బ్యాంకుల నుంచి రైతులు పొందుతున్న రుణాల పరిమాణం ఏటా పెరుగుతూనే ఉంది.

ఈ గణాంకాలు అన్నదాతల ఆర్థిక స్థితిగతులను ప్రతిబింబిస్తున్నాయి. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు పెట్టుబడి సాయం సకాలంలో అందిస్తేనే ఈ రుణ భారం నుంచి వారికి విముక్తి లభిస్తుందని రైతు సంఘాలు పేర్కొంటున్నాయి.

## ‘కమర్షియల్’కు కటకట!

మొదటి పేజీ తరువాయి

కనీసం 50 రోజుల పాటు గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండదని హామీ ఇచ్చాయని, కానీ ఇప్పుడు అకస్మాత్తుగా సరఫరా ఆపివేయడం పరిశ్రమను కోలుకోలేని దెబ్బ తీసిందని అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో కేంద్ర మంత్రులు వెంటనే జోక్యం చేసుకుని, సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.



# బ్యాంకులకు 50,000 కోట్లు

మొదటి పేజీ తరువాయి

చేసింది. ఇందులో ప్రధానంగా 2035లో మెచ్యూర్ అయ్యే 6.33 శాతం వడ్డీ గల రూ.13,507 కోట్ల బాండ్లను, 2030లో ముగిసే 6.01 శాతం వడ్డీ గల రూ.13,494 కోట్ల సెక్యూరిటీలను కొనుగోలు చేసింది. అలాగే 2031 నాటివి రూ.8,157 కోట్లు, 2053 నాటివి రూ.6,955 కోట్లు, 2033 కాలపరిమితి ఉన్న రూ.4,479 కోట్ల బాండ్లను తన ఖాతాలోకి వేసుకుంది. వీటితో పాటు 2039లో ముగిసే రూ.2,304 కోట్లు, 2034 నాటి రూ.1,104 కోట్ల సెక్యూరిటీలను



కూడా ఆర్బీఐ సేకరించింది. ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలో నిధులను మేనేజ్ చేయడానికి ఆర్బీఐ ప్రభుత్వ బాండ్లను కొనుగోలు చేయడం లేదా విక్రయించడం చేస్తుంటుంది. ఆర్బీఐ తాజా గణాంకాల ప్రకారం.. బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రస్తుతం సుమారు రూ.2.41 లక్షల కోట్ల మిగులు నగదు అందుబాటులో ఉంది. పన్ను చెల్లింపుల ద్వారా నిధులు బయటకు వెళ్లినప్పటికీ, వ్యవస్థలో నగదు లభ్యత సురక్షితంగా ఉంటుందని, మిగులు నిధులు రూ.3.02 లక్షల కోట్లుగా ఉంటాయని అంచనా. కాగా, ఈ క్యాలెండర్ సంవత్సరం ప్రారంభం నుంచి ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ ద్వారా ఆర్బీఐ సుమారు రూ.2.50 లక్షల కోట్లను బ్యాంకింగ్ వ్యవస్థలోకి విడుదల చేయడం గమనార్హం.



## మండే బ్లడ్ బాత్

మొదటి పేజీ తరువాయి

తీసుకుంటున్నారు. మార్కెట్ల పతనంతో పాటు డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ కూడా రికార్డు కనిష్టానికి పడిపోయింది. సోమవారం ఉదయం రూపాయి 46 పైసలు నష్టపోయి 92.20 వద్ద ట్రేడ్ అయింది. మార్కెట్లో భయాలకు సూచికగా భావించే ఇండియా వీఐఎక్స్ 20 శాతానికి పైగా పెరగడం ఇన్వెస్టర్లలో నెలకొన్న తీవ్ర ఆందోళనను సూచిస్తోంది. బ్యాంకింగ్, ఎనర్జీ, ఐటీ సహా అన్ని రంగాల షేర్లు నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. గత వారం కూడా మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి. ఇప్పుడు యుద్ధ భయాలు తోడవడంతో అమ్మకాల ఒత్తిడి మరింత పెరిగింది. ఈ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే మార్కెట్లు మరింత పతనం కావొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## మోదీకే ఆ సత్తా

మొదటి పేజీ తరువాయి

ఆయన.. ఈ రెండు దేశాలతోనూ చర్చలు జరిపే సత్తా తమకు ఉందని వెల్లడించారు. శాంతి స్థాపన కోసం అంతర్జాతీయ సమాజం చేస్తున్న ప్రయత్నాల్లో భారత్ వంటి శక్తివంతమైన దేశాల సహకారం ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచ శాంతి కోసం ప్రధాని మోదీ చొరవ తీసుకోవాలని కోరారు.

## ఇరాన్‌కే మా మద్దతు

మొదటి పేజీ తరువాయి

తనకు ఆమోదయోగ్యం కాదని అన్నారు. ఇరాన్‌లో సామరస్యం, శాంతిని తీసుకువచ్చే నేత కావాలని చెప్పారు. తమ ఆమోదం లేకపోతే అతను ఎక్కువ కాలం నిలవడని అన్నారు. అలాగే, ఏం జరుగుతుందో చూద్దామని వ్యాఖ్యానించడం గమనార్హం. ఖ

## గ్యాస్ బుకింగ్‌కు ‘అడ్డుకట్ట’!

మొదటి పేజీ తరువాయి

ముందస్తుగా బుకింగ్ చేసుకుంటున్నారు. గతంలో సగటున 55 రోజులకు ఒకసారి సిలిండర్ బుక్ చేసుకునే వాళ్లు ప్రస్తుతం 15 రోజులకే బుక్ చేస్తున్నారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి రావడంతో ప్రభుత్వం బుకింగ్‌కు 21 రోజుల వ్యవధిని తీసుకొచ్చింది. తాజాగా దీనిని 25 రోజులకు పెంచింది. కాగా, ఎల్పీజీ విక్రయానికి అల్జీరియా, ఆస్ట్రేలియా, కెనడా, నార్వే వంటి దేశాలు ముందుకు వచ్చినట్లు కేంద్రం తెలిపింది.

## 13న మోదీ పైసలు!?

మొదటి పేజీ తరువాయి

డబ్బుల విడుదల విషయంలో కీలక ప్రకటన వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారిక వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఆ రోజు ప్రధాని మోదీ అస్సాం పర్యటనలో భాగంగా పీఎం కిసాన్ యోజన డబ్బులను విడుదల చేసే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. అయితే, దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక సమాచారం లేదు. పీఎం కిసాన్ యోజన కింద ప్రతి సంవత్సరం 6000 రూపాయలు రైతుల ఖాతాలో కేంద్ర ప్రభుత్వం జమ చేస్తుంది. ఈ సంవత్సరం ఫిబ్రవరిలోనే నగదు రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉన్నా, ఇంకా పడలేదు. ఈ నేపథ్యంలో రైతులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

# డోంట్ వర్రీ.. మేమున్నాం: నిర్మల



న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో ముడి చమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో దేశీయంగా ద్రవ్యోల్బణ పెరుగుతుందనే చర్చలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. ప్రపంచ వ్యాప్తంగా ముడి చమురు ధరలు ఇటీవల పెరగడం వల్ల దేశంలో ద్రవ్యోల్బణం భారీగా పెరుగుతుందనే ఆందోళనలు అవసరంలేదని నిర్మలా సీతారామన్ అన్నారు. ఇప్పటికే దేశంలో ద్రవ్యోల్బణం చాలా తక్కువగా ఉంది, భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) నిర్దేశించిన కనిష్ట పరిమితికి దగ్గరగానే ఉంది. ముడి చమురు ధరలూ దాదాపు ఒక ఏడాది కాలంగా తగ్గుతున్నాయని ఆమె ప్రస్తావించారు. అయితే, ఇటీవల పశ్చిమాసియాలో భౌగోళిక రాజకీయ సంఘర్షణలు ప్రారంభమైన తర్వాత ధరలు పెరిగాయి. ఆ సమయంలో, భారత ముడి చమురు ధర బ్యారెల్‌కు 69.01 డాలర్ల నుంచి రోజుల వ్యవధిలో బ్యారెల్‌కు 80.16కి పెరిగిందని మంత్రి వివరించారు. ఆర్‌బీఐ నివేదిక ప్రకారం, ముడి చమురు ధరలు 10 శాతం పెరిగితే, దేశంలో ద్రవ్యోల్బణం 0.30 శాతం మాత్రమే పెరగవచ్చు. అయితే, ఈ పెరుగుదల కూడా వాస్తవంలో రూపాయి-డాలర్ మారకం రేటు, ప్రపంచ చమురు సరఫరా, డిమాండ్, ఆర్థిక విధానాలు వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుందన్నారు.

# 14న బండి 'కొండగట్టు' యాత్ర

## 40 కిలోమీటర్ల కాలినడకన అంజన్న చెంతకు



మల్యాల, మార్చి 9 (ఈవార్తలు): ఈనెల 14వ తేదీన అంజన్న ఆశీర్వాద యాత్ర పేరిట కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మహా పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, ఉప సర్పంచులు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేషన్ కార్పొరేటర్లు, మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు దాదాపు 10 వేల మంది కార్యకర్తలతో పాదయాత్ర చేయబోతున్నారు. ప్రజలంతా బీజేపీని ఆశీర్వదించి అత్యధికంగా స్థానాలను గెలుచుకోవడంతో ఇచ్చిన మాట ప్రకారం మొక్కులు తీర్చుకునేందుకు సిద్ధమయ్యారు. సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంటూ 14న ఉదయం 7 గంటలకు కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం నుండి ఈ మహాపాదయాత్రను ప్రారంభిస్తారు. పార్లమెంట్ పరిధిలోని పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల మొదలు, మండల, జిల్లా, పార్లమెంట్ స్థాయి నాయకులంతా రాజకీయాలకు అతీతంగా పాదయాత్రలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రేకుర్తి, కొత్తపల్లి, గంగాధర, పూడూరు, కొడిమ్యాల, మల్యాల మండలాల మీదుగా కొండగట్టు అంజన్న ఆలయం వద్దకు చేరుకుంటారు. దాదాపు 40 కిలోమీటర్ల మేర కాలి నడకన వెళ్లి కొండగట్టు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ పాదయాత్రలో పలు స్వచ్ఛంద సంస్థలు, భక్త మండళ్లు సైతం ఈ పాదయాత్రలో పాల్గొనే వారికి తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధమయ్యాయి.

# వెలుగుమట్ల బాధితులను ఆదుకోవాలి



### సీఎంకు మంత్రి తుమ్మల విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 9 (ఈవార్తలు): రాష్ట్రంలో అతిపెద్ద కొహెడ మార్కెట్ పనులను త్వరితగతిన చేపట్టడానికి తగు ఆదేశాలను ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కోరారు. సిద్దిపేట జిల్లా నర్మెట్ట ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభోత్సవానికి హాజరు కావాలని కోరినట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఆయిల్‌పామ్‌కు చాలా డిమాండ్ ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రైతులు సాగు చేసేలా అనేక ప్రోత్సహకాలు ప్రకటించినట్లు వెల్లడించారు. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడి ప్రభుత్వంలో రైతులకు పెట్టుబడి సాయం రూ. 12 వేల వరకు పెంపు, రైతు రుణాలు కూడా, రాయితీపై యంత్ర పరికరాలు, విపత్తులకు పంట నష్టం జరిగితే పరిహారం అందజేసినట్లు చెప్పారు. సోమవారం వివిధ అంశాలపై ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో కలిసి పలు అంశాలపై చర్చించారు. రైతుల సౌకర్యార్థం త్వరలోనే శనగ, పొద్దుతిరుగుడు, మినుము, వేరుశనగ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వెలుగుమట్ల లో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని సీఎంను కోరగా దానికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు.

# వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలి

### జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్

### బాధితులకు మద్దతుగా నిరవధిక నిరాహార దీక్ష

ఖమ్మం, మార్చి 9 (ఈవార్తలు): ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖమ్మం నగరం జెడ్పీ కూడలిలో ఆందోళనకు చేపట్టారు. ఖమ్మంలోని అంబేద్కర్ భవనంలో వెలుగుమట్ల బాధితులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాధితులకు న్యాయం జరిగే వరకు తాము అండగా ఉంటామని అన్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు బాధితులకు మద్దతుగా లేదని మండిపడ్డారు. ప్రభుత్వం తరఫున వారికి వైద్య సహాయం కూడా అందడం లేదని విమర్శించారు. 'నేను టూరిస్ట్‌ను కాదు. మీ సమస్యకు పరిష్కారం చూపేవరకూ ఇక్కడే ఉండి పోరాడతా' అని కవిత బాధితులకు భరోసా ఇచ్చారు. జిల్లా కలెక్టర్, మంత్రులు తక్షణమే వెలుగుమట్లకు వచ్చి బాధితులతో మాట్లాడి, వారి సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. పేదల ఇళ్లపై బుల్డోజర్లు పంపడం అన్యాయమని మండిపడ్డారు. కొన్ని రాజకీయ పార్టీలు ఈ దుఃఖాన్ని కూడా రాజకీయం కోసం వాడుకుంటున్నాయని ఆమె ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ వాళ్లు కూడా ఇళ్లు కూల్చడానికి ప్రయత్నాలు చేశారని కవిత అన్నారు. ఎక్కడైతే ఇళ్లు కూల్చివేశారో అక్కడే తిరిగి స్థలాలు ఇచ్చి, ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు, సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికేంత వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని కవిత స్పష్టం చేశారు. అనంతరం కార్యకర్తలు, బాధితులతో కలిసి జెడ్పీ కూడలిలో ఆందోళనకు దిగారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జెడ్పీ కూడలిలో రోడ్డుపై బైఠాయించారు. దీనితో రోడ్డుపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు జోక్యం చేసుకుని, సర్ది చెప్పడంతో కవిత నిరసన విరమించారు.






# కావూరి ఆరోగ్యం విషమం


### ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స

హైదరాబాద్, మార్చి 9 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు ఆరోగ్యం విషమంగా ఉంది. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరోవైపు, ఆయన కన్నుమూశారనే వార్తలను పలు మీడియా సంస్థలు ఈరోజు బ్రేకింగ్ న్యూస్ గా వేశాయి. ఈ వార్తలు కలకలం రేపాయి. ఈ నేపథ్యంలో కావూరి కుటుంబ సభ్యులు స్పందించారు. కావూరి కన్నుమూశారనే వార్తల్లో నిజం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు ఆయనను వెంటిలేటర్‌పై ఉంచి పర్యవేక్షిస్తున్నారని వారు స్పష్టం చేశారు. ఆయన ఇంకా చికిత్స పొందుతున్నారని, దయచేసి అధికారిక సమాచారం వచ్చే వరకు ఇటువంటి వదంతులను ప్రసారం చేయవద్దని విన్నవించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన కావూరి సాంబశివరావు ఐదుసార్లు ఎంపీగా ఎన్నికై రికార్డు సృష్టించారు. 1984, 1989, 1998లలో మచిలీపట్నం నుంచి... 2004, 2009లలో ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి ఆయన విజయం సాధించారు. 2013లో యూపీఏ ప్రభుత్వ హయాంలో కేంద్ర జౌళిశాఖ మంత్రిగా కూడా సేవలు అందించారు. రాష్ట్ర విభజన అనంతరం కాంగ్రెస్‌కు దూరమై బీజేపీలో చేరినప్పటికీ, గత కొంతకాలంగా అనారోగ్య కారణాల వల్ల క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.

# కవిత, కేజ్రీకి ఢిల్లీ హైకోర్టు నోటీసులు

### రివిజన్ పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని ఆదేశం





న్యూఢిల్లీ: దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ మళ్లీ కీలక మలుపు తిరిగింది. ఫిబ్రవరి 27న రౌస్ అవెన్యూ కోర్టు అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, కల్వకుంట్ల కవిత సహా మొత్తం 23 మందిని ఈ కేసు నుండి విముక్తి చేస్తూ తీర్పును వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కోర్టు తీర్పును ఢిల్లీ హైకోర్టులో సీబీఐ సవాల్ చేసింది. ఈ క్రమంలో సీబీఐ పిటిషన్ పై ఈరోజు హైకోర్టు విచారణ జరిపింది. ఈ విచారణలో భాగంగా ధర్మాసనం కేజ్రీవాల్, కవిత, సిసోడియాతో పాటు మిగిలిన నిందితులందరికీ నోటీసులు జారీ చేసింది. సీబీఐ దాఖలు చేసిన ఈ రివిజన్ పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. విచారణ సందర్భంగా సీబీఐ తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ... విచారణాధికారిపై కోర్టు చేసిన వ్యాఖ్యలు దర్యాప్తు సంస్థల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన హైకోర్టు, దర్యాప్తు సంస్థ, విచారణాధికారిపై ట్రయల్ కోర్టు చేసిన ప్రతికూల వ్యాఖ్యలపై స్టే విధిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాకుండా, సీబీఐ కేసులో నిందితులు విడుదలయ్యారు కాబట్టి ఈడీ దాఖలు చేసిన మనీ లాండరింగ్ కేసు విచారణను కూడా నిలిపివేయాలని నిందితుల తరపు న్యాయవాదులు కోరగా.. హైకోర్టు భిన్నంగా స్పందించింది. సీబీఐ రివిజన్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే వరకు మనీ లాండరింగ్ కేసు విచారణను వాయిదా వేయాలని ట్రయల్ కోర్టుకు సూచించింది. తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

# రాహుల్ బంధుకు 1000 కోట్లు

### రేవంత్‌పై కేటీఆర్ ఆరోపణలు



సిరిసిల్ల, మార్చి 9 (ఈవార్తలు): 'రాహుల్ బంధు' పథకం కింద ప్రతి సంవత్సరం రూ.1000 కోట్లు ఇచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవిని కాపాడుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సిరిసిల్లలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ హయాంలో డిసెంబర్ నెలలో రైతుబంధు పడేదని, కానీ ఇప్పుడు కోతల సమయం వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం వేయలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనలో రైతుబంధును నిలిపివేసి 'రాహుల్ బంధు' పేరుతో కొత్త పథకం తెచ్చారని ఎద్దేవా చేశారు. తన పదవిని కాపాడుకోవడం కోసం రేవంత్ రాహుల్ బంధు పథకం కింద గాంధీ కుటుంబానికి వెయ్యి కోట్ల రూపాయలు ఇస్తున్నాడని ఆరోపించారు. అందుకే కేసీఆర్ ముందే చెప్పారని, ఆలోచించి జాగ్రత్తగా ఓటు వేయాలని సూచించారని తెలిపారు. రేవంత్ రెడ్డి మూడుసార్లు రైతుబంధును ఎగ్గొట్టారని విమర్శించారు. "నేను రుణమాఫీ చేశానని అనుకుంటున్నా, రైతుబంధు వేశానని అనుకుంటున్నా" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల అన్నారని, అసలు ఆయన ముఖ్యమంత్రేనా అని నిలదీశారు. మరి ముఖ్యమంత్రిగా మీరెందుకు ఉన్నారని ప్రశ్నించారు. రైతుబంధు వేస్తే, రుణమాఫీ ఇస్తే మీకు తెలియకుండా ఉండటమేమిటని అన్నారు. హైదరాబాద్‌లో దోమలు బాగా పెరిగిపోయాయని, కానీ నగరంలో చెత్తను మాత్రం తీయడం లేదని విమర్శించారు.

# ఫీజుల్లేవ్ గానీ.. స్కూటీలా?

## రేవంత్ హామీపై బండి చురకలు



కరీంనగర్, మార్చి 9 (ఈవార్తలు): కాలేజీ విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు పంపిణీ చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం ఈ కీలక ప్రకటన చేయగా, దీనిపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ 'ఎక్స్' వేదికగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు ఎటు వెళుతున్నాయో అర్థం కావడం లేదని ఆయన మండిపడ్డారు. బండి సంజయ్ తన విమర్శల్లో ప్రధానంగా కాలేజీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రస్తావించారు. ఓవైపు వేల కోట్ల ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయని, దీని కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే... మరోవైపు, అవేమీ పట్టించుకోకుండా ఉచిత ఈవీ స్కూటర్లు ఇస్తామని వాగ్దానాలు చేయడం ప్రజలను వంచించడమేనని ధ్వజమెత్తారు. దళితులు, గిరిజనులకు పంపిణీ చేయడానికి భూములు లేవని చెబుతున్న ప్రభుత్వం, జర్నలిస్టులు, మూసీ బాధితులకు ఫ్యూచర్ సిటీలో స్థలాలు ఎలా ఇస్తుందని ఆయన ప్రశ్నించారు. పెన్షన్లు ఇవ్వడానికి నిధులు లేవని సాకులు చెబుతున్నారని... మరి, మూసీ ప్రాజెక్టు కోసం వేల కోట్లు ఎక్కడి నుంచి వస్తున్నాయని నిలదీశారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు దోమల బెడద పెరిగిందని... ప్రజలు తమ పని తాము చేసుకుంటున్నా, కాంగ్రెస్ నేతలు దోమల్లా వచ్చి ఇబ్బంది పెడుతున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య

కొండాపూర్-హైదరాబాద్, మార్చి 9 (ఈవార్తలు): పని ఒత్తిడి తట్టుకోలేక హైదరాబాద్‌లో ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య చేసుకుంది. నగరంలోని కొండాపూర్ సుమధుర అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న 32 ఏళ్ల మనుశ్రీ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గచ్చిబౌలి పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పని ఒత్తిడి కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం ఆమె మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మనుశ్రీ కర్ణాటక రాష్ట్రానికి చెందిన యువతి. నిన్న రాత్రి నుంచి ఆమె ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో తల్లిదండ్రులు పక్క గదిలో ఉంటున్న యువతికి ఫోన్ చేశారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పక్క గదిలో ఉంటున్న యువతి వచ్చి గది తలుపులు తీయడంతో ఫ్యానుకు ఉరివేసుకుని విగతజీవిగా కనిపించింది. అపార్ట్‌మెంట్ సెక్యూరిటీ సిబ్బంది గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



# దూరదృష్టి లేకనే కాలుష్యం

### ఢిల్లీ, బెంగళూరుకు ట్రాఫిక్ సమస్య

### కొత్త సవాళ్లకు ఖాకీలు అప్‌గ్రేడ్ అవ్వాలి

### పోలీస్ రీట్రీట్ కార్యక్రమంలో సీఎం రేవంత్

హైదరాబాద్, మార్చి 9 (ఈవార్తలు): దేశ రాజధాని ఢిల్లీ అత్యంత తీవ్రమైన కాలుష్యాన్ని ఎదుర్కొంటోందని, బెంగళూరును ట్రాఫిక్ సమస్య వేధిస్తోందని, ముంబై, చెన్నై నగరాలు వరద సమస్యలను చూస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పాలకులకు దూరదృష్టి లేకపోవడం వల్లే ఇలాంటి సమస్యలు వస్తున్నాయని అన్నారు. పోలీసు అధికారుల రీట్రీట్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారానే పోలీసు శాఖకు గౌరవం పెరుగుతుందని అన్నారు. కొత్త కొత్త మార్గాల్లో నేరాలు జరుగుతున్నాయని, ఇవి పోలీసులకు సవాళ్లుగా మారుతున్నాయని అన్నారు. భౌతికంగా కనిపించని నేరాలను కనిపెట్టడం సవాళ్లతో కూడుకున్నదని అన్నారు. కొత్త సవాళ్లు ఎదుర్కోవాలంటే పోలీసు అధికారులు అప్ గ్రేడ్ కావాలని అన్నారు. సమస్యను బాగా అర్థం చేసుకుంటే సగం పరిష్కారం లభించినట్లేనని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రమైనా, దేశమైనా అభివృద్ధి చెందాలంటే శాంతిభద్రతలు బాగుండాలని అన్నారు. శాంతిభద్రతలు బాగున్న రాష్ట్రాలకే పెట్టుబడులు బాగా వస్తున్నాయని అన్నారు. దేశ జనాభాలో తెలంగాణ వాటా 2.5 శాతం కాగా, జీడీపీలో మాత్రం 5 శాతం అందిస్తోందని అన్నారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతానికి చేరాలనేది తమ ఆశయమని అన్నారు.

# రాజ్యసభ సభ్యులుగా వేం, సింఘ్వీ ఏకగ్రీవం

### ధ్రువపత్రాలు అందజేసిన రిటర్నింగ్ అధికారి





న్యూఢిల్లీ: తెలంగాణ సమస్యలను రాజ్యసభలో, ఢిల్లీలో వినిపిస్తానని రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ తరఫున రాజ్యసభ సభ్యులుగా అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇద్దరికీ రిటర్నింగ్ అధికారి ధృవపత్రాలను అందించారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించిన ఏఐసీసీ పెద్దలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ సమస్యలను రాజ్యసభలో, ఢిల్లీలో వినిపించి వాటిని పరిష్కరించే విధంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తానని అన్నారు.

# సారా దుకాణాలను తెరవాలి: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 9 (ఈవార్తలు): జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సోమవారం సచివాలయంలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్ చాట్‌లో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రాబోయే బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో తాను ఒక 'బాంబు' పేల్చబోతున్నానని చెప్పారు. గతంలో స్వచ్ఛమైన సారా తాగిన వారు 115 ఏళ్ల వరకు ఆరోగ్యంగా బతికేవారని, కానీ ఇప్పుడు లిక్కర్ తాగి 80 ఏళ్లకే చనిపోతున్నారని ఆయన అన్నారు. శాస్త్రీయంగా చూస్తే సారా ఆరోగ్యానికి హానికరం కాదని ఆయన వాదించారు. అసలు తెలంగాణలో సారాను ఎందుకు నిషేధించారో ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో 'జీరో అవర్'లో ఈ అంశాన్ని లేవనెత్తుతానని, సారా దుకాణాలను మళ్లీ తెరవాలని కోరతాననని చెప్పారు. మధ్యప్రదేశ్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో ప్రభుత్వాలే అధికారికంగా సారా దుకాణాలను నడుపుతున్నాయని, అదే తరహాలో తెలంగాణలో కూడా ఎందుకు అమలు చేయకూడదని ఆయన ప్రశ్నించారు.

# లంచగొండి ఎస్సైలు

### లంచం తీసుకుంటూ చిక్కిన సైబర్ క్రైమ్ ఎస్సైలు

ఎల్బీనగర్-హైదరాబాద్, మార్చి 9 (ఈవార్తలు): ఎల్బీనగర్ సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్ కు చెందిన ఇద్దరు ఎస్సైలు ఏసీబీకి అడ్డంగా దొరికిపోయారు. ఒక కేసులో నిందితుడికి 41 నోటీసులు ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసి ఏసీబీ అధికారులకు చిక్కారు. వివరాల్లోకి వెళితే... ఎల్బీనగర్ సైబర్‌క్రైమ్ విభాగంలో పనిచేస్తున్న ఎస్ఐ బాబునాయక్, ఎస్ఐ ప్రమోద్ ఒక కేసు విషయంలో నిందితుడిని ఇబ్బంది పెట్టకుండా ఉండేందుకు, నోటీసులు ఇచ్చే ప్రక్రియను పూర్తి చేసేందుకు లక్ష రూపాయలను లంచంగా డిమాండ్ చేశారు. దీనిపై బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించడంతో వారు పక్కా ప్లాన్ వేశారు. ఫిర్యాదుదారు నుంచి ఆ లక్ష రూపాయల నగదును ఎస్ఐలు తీసుకుంటుండగా, మాటు వేసిన ఏసీబీ అధికారులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఎల్బీనగర్ సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ బృందాలు విస్తృతంగా సోదాలు నిర్వహించాయి.

## సిలిండర్ ధరలను ఉపసంహరించుకోవాలి: బండ్ల స్వామి




గజ్వేల్, మార్చి 9 (ఈవార్తలు): గ్యాస్ సిలిండర్ ల ధరలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వము తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గ్యాస్ సిలిండర్ ధరల పెంపుదల ప్రజలపై శాపంగా మారిందని అన్నారు. వంట గ్యాస్ ధర రూ.60 పెంపు, వాణిజ్య సిలిండర్ ధర రూ.115 పెంపు సామాన్య ప్రజలకు పెద్ద దెబ్బ అని చెప్పారు. ఇప్పటికే పేద, మధ్య తరగతి ప్రజలు నిత్యావసరాల ధరలతో ఇబ్బంది పడుతుంటే, కేంద్రం గ్యాస్ ధరలు పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. గ్యాస్ ధరలను నియంత్రించడం కోసం సబ్సిడీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సామాన్య,పేద ప్రజల విషయంలో కేంద్రం ఆలోచన చేయాలన్నారు. లేదంటే ప్రజలతో కలిసి ఉద్యమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

## పోలయ్య కవికి ఘన సన్మానం



బాగ్‌లింగంపల్లి–హైదరాబాద్, మార్చి 9 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం శంకరం ఫౌండేషన్, భారత సాహిత్య అనువాద ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కళారత్న డాక్టర్ బిక్కికృష్ణ అధ్యక్షతన మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించి, ప్రముఖ కవి పోలయ్యను సత్కరించారు. కార్యక్రమంలో శంకరం ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు యలపర్తి ధనలక్ష్మి, గజల్ క్వీన్ వాసిరెడ్డి మల్లేశ్వరి, జస్టిస్ టీ రజని, డాక్టర్ కోగంటి ఉషారాణి, అలేఖ్య, డాక్టర్ రాధా కుసుమ, డాక్టర్ జల్దీ విద్యాధర్, డాక్టర్ రఘు అరికపూడి, డాక్టర్ విజయలక్ష్మి పండిట్, యమునా పాఠక్ పాల్గొన్నారు.




## పార్శికుంటకు హద్దులు ఏర్పాటు చేయాలి

**సిద్దిపేట జిల్లా కలెక్టర్కు జంగం రమేశ్ గౌడ్ వినతి**

గజ్వేల్, మార్చి 9 (ఈవార్తలు): సిద్దిపేట జిల్లా గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని రాజిరెడ్డిపల్లి రోడ్డులోని పార్శికుంటకు హద్దులు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జంగం రమేశ్ గౌడ్ జిల్లా కలెక్టర్ హైమావతిని కోరారు. సోమవారం సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. తక్షణమే కలెక్టర్ సానుకూలంగా స్పందించి, అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. పార్శికుంట ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉందని, వెంటనే సరిహద్దులు గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరానని వెల్లడించారు.

## ప్రియుడి అవమానం.. యువతి ఆత్మహత్య!



జగదేవపూర్, మార్చి 9 (ఈవార్తలు): సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం వట్టిపల్లి గ్రామానికి చెందిన తప్పెట్ల ఝాన్సీ (26) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు పలుగడ్డ ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యా వలంటీర్‌గా పనిచేస్తోంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, గత నాలుగు సంవత్సరాలుగా గొల్లపల్లి గ్రామానికి చెందిన నవీన్ కుమార్‌ని ప్రేమిస్తోంది. పెళ్లి చేసుకుంటానని చెప్పి నమ్మించిన నవీన్.. ఇటీవల వేరే సంబంధం ఖాయం చేసుకున్నాడు. ఝాన్సీతో మాట్లాడకుండా దూరంగా ఉన్నారు. దీనిపై మాట్లాడేందుకు ఆమె నవీన్ ఇంటికి వెళ్లగా.. ఘోరంగా అవమానించాడు. దీంతో మనస్తాపానికి గురై సోమవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.




## ఖమ్మంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

ఖమ్మం, మార్చి 9 (ఈవార్తలు): ఖమ్మం నగరంలోని 35వ డివిజన్లో కార్పొరేట్ యల్లంపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. డివిజన్లోని స్థానిక మహిళలు ఒక ప్రాంగణంలో సమావేశం జరిపి, కేకులు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపల్లి పద్మ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగంలో ముందు ఉండాలని పురుషులతో సమానంగా పోటీ పడాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బజ్జూరి ఇందిరా రెడ్డి, ఉప్పుగడ్ల ప్రమీల, బుగ్గ వీటి కృష్ణవేణి, లీలావాణి, లక్ష్మి, శ్రీదేవి, లత, దేవీ, కౌసల్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## చంద్రికకు శాప్ చైర్మన్ ఆర్థిక సహాయం

విజయవాడ, మార్చి 9 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్ బొల్లినేని చంద్రిక అనారోగ్యానికి గురవ్వడం క్రీడా వర్గాల్లో ఆందోళన కలిగిస్తోంది. 'స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్'గా గుర్తింపు పొందిన ఆమెను శాప్ చైర్మన్ రవి నాయుడు ఆసుపత్రిలో పరామర్శించారు. చంద్రిక ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం తరపున చంద్రికకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తక్షణ సాయంగా రూ. 1 లక్ష నగదును రవి నాయుడు అందజేశారు. రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన క్రీడాకారులను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యతని ఆయన పేర్కొన్నారు. చంద్రిక కేవలం క్రీడాకారిణి మాత్రమే కాదని, ఆమె పోరాట స్ఫూర్తి ఎంతో మంది యువ అథ్లెట్లకు ఆదర్శమని కొనియాడారు. 2017 కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్ మరియు 2019 ఆసియా పసిఫిక్ ఛాంపియన్‌షిప్‌లలో స్వర్ణ పతకాలు సాధించిన చంద్రిక, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.



మై విలేజ్ షో సంస్థలో గతంలో పని చేసిన అనిల్ జీలా సంస్థ నుండి తప్పుకున్నాడు.
అనిల్ జీలా మరియు ఆయన ప్రస్తుత కంపెనీలకు మై విలేజ్ షో తో ఎటువంటి సంబంధం లేదా అనుబంధం లేదు.
అనిల్ జీలా లేదా ఆయన కంపెనీలు నిర్వహించే ఏ సేవలు, ప్రమోషన్లు లేదా వ్యాపారాలకీ మేము బాధ్యత వహించము.
ఇంకా, ఎవరైనా మై విలేజ్ షోకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకుంటూ మిమ్మల్ని సంప్రదించినట్లయితే, దయచేసి మా అధికారిక ఛానెల్‌ల ద్వారా ధ్రువీకరించుకోండి.
ప్రమోషన్లు, లేదా ఇతర సేవల కోసం, మా అధికారిక చానెల్స్ ద్వారా నేరుగా సంప్రదించండి. ఇలా చేయడం ద్వారా మీరు నిజంగా మా అథారైజ్డ్ టీమ్‌తోనే వ్యవహరిస్తున్నారని నిర్ధారించుకోగలరు.
మా ప్రియ ప్రేక్షకులు మరియు శ్రేయోభిలాషులందరు దయచేసి ఈ విషయాన్ని గమనించగలరని మనవి.
🙏 మీ అవగాహన మరియు స్థిరమైన మద్దతుకు ధన్యవాదాలు.
మా అధికారిక ఇమెయిల్ ఐడి
✉️: srikanth@myvillageshow.in

# 'మై విలేజ్ షో'లో చీలిక!

**అనిల్ జీలాతో మాకు సంబంధం లేదు**

**ప్రకటన విడుదల చేసిన మై విలేజ్ షో టీం**

మల్యాల, మార్చి 9 (ఈవార్తలు): తెలంగాణ యాస, భాష, వేషంతో క్రేజ్ సంపాదించుకున్న 'మై విలేజ్ షో' యూట్యూబ్ చానల్‌లో చీలిక ఏర్పడింది. జగిత్యాల జిల్లా మల్యాల మండలం లంబాడి పల్లె గ్రామానికి చెందిన యువకులు శ్రీకాంత్, అనిల్ జీలా, శివకృష్ణ ఈ చానల్ ఏర్పాటు చేశారు. 3.14 మిలియన్ ఫాలోవర్స్ కలిగిన ఈ చానల్.. రెండు తెలుగు రాష్ట్రాలలో ఆదరణ దక్కించుకుంది. అయితే, తాజాగా ఈ చానల్ నిర్వాహకుల మధ్య అభిప్రాయ భేదాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ యూట్యూబ్ చానల్ నుంచి అనిల్ జీలా తప్పుకున్నాడు. ఈ విషయాన్ని స్వయంగా మై విలేజ్ షో యూట్యూబ్ చానల్ బృందం.. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టి మరి వెల్లడించింది. ఇక నుంచి అనిల్‌కు, తమ చానల్‌కు ఎలాంటి సంబంధం ఉండబోదని స్పష్టం చేసింది. ఇప్పటికే అనిల్ జీలా సొంతంగా ఒక యూట్యూబ్ చానల్‌ను నడిపించుకుంటున్నాడు. సోషల్ మీడియాలో కూడా ప్రమోషన్స్ చేస్తున్నాడు. ఈ తరుణంలోనే 'మై విలేజ్ షో' బృందానికి, అనిల్‌కు అభిప్రాయభేదాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే అనిల్ జీలా చేసే ప్రమోషన్లు, ఆయన వ్యాపారాలకు 'మై విలేజ్ షో' కు ఎలాంటి సంబంధం లేదని టీమ్ పేర్కొంది. మై విలేజ్ షో పేరుతో ఎవరైనా సంప్రదిస్తే, తమ అధికారిక సోషల్ మీడియాల ద్వారా సమాచారం ఇవ్వాలని కోరింది. ఎవరినీ నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేసింది.

# సైబర్ మోసాలపై 1930 కంప్లెయింట్

**నర్సింగ్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం**




జగిత్యాల టౌన్, మార్చి 9 (ఈవార్తలు): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ మహిళా నర్సింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సైబర్ క్రైమ్ డీఎస్పీ వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు సైబర్ భద్రతపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు, ముఖ్యంగా విద్యార్థినులు సోషల్ మీడియా వేదికల ద్వారా జరుగుతున్న వివిధ రకాల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ స్టాకింగ్, సైబర్ బుల్లీయింగ్ వంటి సమస్యలు ఇటీవలి కాలంలో పెరుగుతున్నాయని, సోషల్ మీడియా లేదా మెసేజింగ్ యాప్స్ ద్వారా అసభ్యకరమైన సందేశాలు పంపడం, వేధించడం, బెదిరించడం వంటి చర్యలు సైబర్ నేరాల పరిధిలోకి వస్తాయని వివరించారు. ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే ఫేక్ సోషల్ మీడియా ప్రొఫైల్‌ల ద్వారా జరుగుతున్న మోసాలపై కూడా అవగాహన కల్పించారు. ఇతరుల పేరుతో నకిలీ ఖాతాలను సృష్టించి డబ్బులు అడగడం, వ్యక్తిగత వివరాలు సేకరించడం వంటి ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. అందువల్ల సోషల్ మీడియాలో తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని సూచించారు. విదేశాల్లో ఉద్యోగం, గిఫ్ట్ పంపిస్తున్నామని చెప్పి డబ్బులు అడిగే మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఫిషింగ్ లింకులు పంపించి డేటా దొంగిలించడం, ఓటీపీలు తీసుకోవడం వంటి సైబర్ మోసాల గురించి కూడా వివరించారు. సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లు ఉపయోగించడం, ప్రైవసీ సెట్టింగ్స్‌ను సరిచేసుకోవడం, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకపోవడం వంటి భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని, అలాగే https://cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదు నమోదు చేయవచ్చని తెలిపారు. బాధితులు ఆలస్యం చేయకుండా వెంటనే సమాచారం అందిస్తే మోసపోయిన డబ్బులను తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, సైబర్ క్రైమ్ ఎస్సైలు కృష్ణ, దినేశ్, టౌన్ ఎస్సై సుప్రియ, కళాశాల సిబ్బంది, కళా బృంద సభ్యులు, సుమారు 250 మంది నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.



## సునీల్ నాయక్ విచారణ పొడిగింపు

గుంటూరు, మార్చి 9 (ఈవార్తలు): ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఐపీఎస్ అధికారి ఎం. సునీల్ నాయక్ ఐదో రోజు విచారణ ముగిసింది. గుంటూరులోని సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో విచారణ అధికారి, విజయనగరం ఎస్పీ దామోదర్ ఆయనను ప్రశ్నించారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు.. దాదాపు ఏడు గంటల పాటు ఈ విచారణ కొనసాగింది. సీసీఎస్ స్టేషన్‌కు తరలించడానికి ముందు, సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో రఘురామ కస్టోడియల్ టార్చర్ ఘటనకు సంబంధించి పోలీసులు సీన్ రీక్రియేషన్ చేసినట్లు సమాచారం. గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు మార్చి 5 నుంచి 9వ తేదీ వరకు ఐదు రోజుల పాటు సునీల్ నాయక్ పోలీసుల విచారణకు హాజరయ్యారు. సోమవారంతో ఈ విచారణ ముగుస్తుందని అంతా భావించారు. అయితే, సునీల్ నాయక్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ప్రభుత్వం తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపించగా.. సునీల్ నాయక్ తరపు న్యాయవాదులకు వాదనలు వినిపించేందుకు న్యాయస్థానం మార్చి 12 వరకు అవకాశం కల్పించింది. విచారణ అధికారి కోరిక మేరకు, మార్చి 12 వరకు విచారణకు హాజరుకావాలని హైకోర్టు సునీల్ నాయక్‌ను ఆదేశించింది. దీంతో మరో మూడు రోజుల పాటు ఆయనను విచారించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. గత ప్రభుత్వ హయాంలో రఘురామకృష్ణరాజు సీఐడీ కస్టడీలో ఉన్నప్పుడు కాళ్లు వాచి, నడవలేని స్థితిలో కోర్టుకు హాజరైన ఘటన ఈ కేసుకు ప్రధాన కేంద్రం అన్న విషయం తెలిసిందే.

# టీడబ్ల్యూజేఎఫ్‌కు పార్టీలతో సంబంధం లేదు

**జర్నలిస్టుల పక్షాన మాత్రమే పోరాడుతుంది.. త్వరలో భారీగా రాష్ట్ర మహాసభలు: మామిడి సోమయ్య**



హైదరాబాద్, మార్చి 9 (ఈవార్తలు): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) పట్ల కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టులను అయోమయానికి గురి చేయడానికే కొందరు ఈ సంఘం తమదే అంటూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, అలాంటి తప్పుడు ప్రచారాలను జర్నలిస్టులు నమ్మవద్దని కోరారు. సోమవారం హైదరాబాద్ లో నల్గొండ జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ గోలి విజయకుమార్, పలువురు జర్నలిస్టులు టిడబ్ల్యూజేఎఫ్ లో చేరారు. వీరికి మామిడి సోమయ్య సంఘం సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఫెడరేషన్ ఏ ఒక్క రాజకీయ పార్టీకి గానీ, ఏ ఒక్క మీడియా సంస్థకు గానీ అనుబంధం కాదని స్పష్టం చేశారు. సంఘం వ్యవస్థాపక సభ్యులు అన్ని జిల్లాల్లో పర్యటించి సంఘం బలోపేతానికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో కొందరు మాజీ నాయకులు సంఘాన్ని విచ్చిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. అన్ని జిల్లాల మహాసభలు త్వరితగతిన పూర్తి చేసి త్వరలో రాష్ట్ర మహాసభ భారీ ఎత్తున నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జర్నలిస్టుల ప్రధాన సమస్యలు ఇప్పటి వరకు పరిష్కారం కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లుగా జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్ కార్డులు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల ఉద్యమానికి టీడబ్ల్యూజేఎఫ్ సిద్ధమవుతుందని మామిడి సోమయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కో కన్వీనర్ తన్నీరు శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ రవికుమార్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పాల్వాయి జానయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఏపీ లిక్కర్ స్కాం.. ఈడీ దర్యాప్తు ముమ్మరం

విజయవాడ, మార్చి 9 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో విచారణను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముమ్మరం చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న కె.ధనుంజయరెడ్డి , కృష్ణమోహన్‌రెడ్డి, వెంకటేశ్ నాయుడు, చాణక్య ఈరోజు ఈడీ విచారణకు హాజరయ్యారు. రెండు గంటల విచారణ తర్వాత కృష్ణమోహన్‌రెడ్డి వెళ్లిపోగా... ఇతర నిందితులను అధికారులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం పాలసీని ఎలా రూపొందించారు? కేవలం నగదు రూపంలోనే లావాదేవీలు ఎందుకు నిర్వహించారు? అనే అంశాలపై ఈడీ అధికారులు ఆరా తీశారు. ముఖ్యంగా పాప్యులర్ బ్రాండ్లను కాదని, కొత్త బ్రాండ్లకు అనుమతులు ఇవ్వడం వెనుక ఉన్న కారణాలపై సమాచారాన్ని రాబట్టేందుకు ఈడీ అధికారులు ప్రయత్నించారు.. ఈ కుంభకోణం వల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 4,000 కోట్ల నష్టం వాటిల్లిందని ఈడీ ప్రాథమికంగా అంచనా వేసింది. అక్రమ సొమ్మును షెల్ కంపెనీల ద్వారా మళ్లించి, తిరిగి నిందితుల ఖాతాల్లోకి చేరేలా ప్రణాళిక రచించినట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే ఈ కేసులో నిందితులైన రాజ్ కెసిరెడ్డి,

# జిల్లా కమిటీల్లోనూ డెస్క్ జర్నలిస్టులు!

**అక్రెడిటేషన్ల సంఖ్య పెంపుపై ప్రభుత్వానికి ప్రతిపాదించాం**

**డీజేఎస్‌తో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వెల్లడి**



హైదరాబాద్, మార్చి 9 (ఈవార్తలు): మనమంతా వర్కింగ్ జర్నలిస్టులమని.. డెస్క్, ఫీల్డ్ జర్నలిస్టులు అనే తేడాలు ఏమీ ఉండవని అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వబోమని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. డెస్క్ జర్నలిస్టులకు కార్డుల సంఖ్య పెంచడం సహా రాష్ట్ర అక్రెడిటేషన్ కమిటీ మొదటి మీటింగ్‌లో చర్చకు వచ్చిన పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. మీడియా అకాడమీ చైర్మన్‌గా రెండోసారి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సోమవారం డెస్క్ జర్నలిస్టుల సంఘం(డీజేఎస్) ప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డిని కలిసి అభినందనలు తెలియజేశారు. అనంతరం డీజేఎస్ అధ్యక్షుడు బాదిని ఉపేందర్, డీజేఎస్ ప్రతినిధులు డెస్క్ జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలతో కూడిన వినతపత్రం అందజేసి.. వాటిని పరిష్కరించాల్సిందిగా కోరారు. సెంట్రల్ డెస్కులు, జిల్లాల డెస్కుల్లో పనిచేసే జర్నలిస్టులకు జారీ చేసే కార్డుల సంఖ్య పెంచాలని కోరగా, ఈ అంశంపై ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించామని, ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర అక్రెడిటేషన్ కమిటీలో డెస్క్ జర్నలిస్టుల ప్రతినిధికి స్థానం కల్పించినట్టుగానే, జిల్లా అక్రెడిటేషన్ కమిటీల్లో కూడా డెస్క్ జర్నలిస్టులకు స్థానం కల్పించాల్సిందిగా విజ్ఞప్తి చేయగా, సానుకూలంగా స్పందించారు. ఈ విషయంపై ఐ అండ్ పీఆర్ అధికారులతో మాట్లాడతానని తెలిపారు. అలాగే ఫీల్డ్ , డెస్క్ అనే తేడా లేకుండా అక్రెడిటేషన్ కార్డుల జారీలో మహిళా జర్నలిస్టులకు 33 శాతం కోటా వర్తింపజేయాలని కోరాగా.. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలకు ప్రస్తుతం జారీ చేయనున్న అక్రెడిటేషన్ కార్డుల సంఖ్యకు అదనంగా 33 శాతం కార్డులు మహిళలకు కేటాయించాలనుకుంటున్నట్టు తెలిపారు. ఒకవేళ ఆ సంఖ్య మేరకు సంస్థల్లో మహిళలు లేకపోతే వాటిని ఖాళీగానే ఉంచాల్సి ఉంటుందన్నారు. జర్నలిస్టులకు జారీ చేసే హెల్త్ కార్డులు ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా చెల్లుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరగా, ఈ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని వెల్లడించారు. శ్రీనివాస్ రెడ్డిని కలిసిన వారిలో డీజేఎస్ ప్రతినిధులు రాజారాం, వెంకటరమణ, సీహెచ్ సైదిరెడ్డి, ఎస్ వెంకటేశ్, నరేందర్ తదితరులు ఉన్నారు.

# అవి ప్రభుత్వ హత్యలే

**రాజమండ్రి కల్తీ పాల ఘటనపై షర్మిల**

రాజమండ్రి, మార్చి 9 (ఈవార్తలు): ఏపీలోని రాజమండ్రిలో కల్తీ పాలు తాగి 11 మంది మరణించడంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు. ఈ మరణాలను ప్రభుత్వ హత్యలుగా అభివర్ణించిన ఆమె, రాష్ట్ర ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యం, ఆహార భద్రతా వైఫల్యమే ఈ ఘోరానికి కారణమని ఆరోపించారు. సోమవారం రాజమండ్రిలోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఇది ప్రమాదం కాదని, అధికారుల ఉదాసీనత వల్లే జరిగిందని అన్నారు. వరలక్ష్మి అనే పాల వ్యాపారి దాదాపు 11 ఏళ్లుగా ఎలాంటి లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నా, ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమని విమర్శించారు. అధికారులకు తెలియకుండా ఇన్నేళ్లుగా అక్రమ వ్యాపారం ఎలా సాధ్యమైందని ఆమె ప్రశ్నించారు. ఇథిలీన్ గ్లైకాల్ కలిపిన పాలు తాగడం వల్లే పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, కొందరు వెంటిలేటర్‌పై ప్రాణాలతో పోరాడుతున్నారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పాలు, నెయ్యి, మద్యం, తాగునీరు సహా అన్ని నిత్యావసరాలు కల్తీమయం అవుతున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాజమండ్రి వంటి నగరానికి ఒక్కరే ఫుడ్ సేఫ్టీ అధికారి ఉండటం, ఆయన కూడా స్థానికంగా అందుబాటులో లేకపోవడం సిబ్బంది కొరతకు నిదర్శనమన్నారు. ఈ ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నైతిక, పరిపాలనా బాధ్యత వహించాలని షర్మిల డిమాండ్ చేశారు.

# పాక్ ఆయుధాలు కొంటూనే ఉంది!

### 80 శాతం దిగుమతి చైనా నుంచే

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఆయుధాలను అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో నిలిచింది. 2021-2025 మధ్య కాలంలో ప్రపంచ ఆయుధ దిగుమతుల్లో భారత్ వాటా 8.3 శాతంగా ఉందని స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ తన తాజా నివేదికలో వెల్లడించింది. రష్యాతో యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్ 9.7 శాతం వాటాతో ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉంది. సిప్రి విడుదల చేసిన 'ట్రెండ్స్ ఇన్ ఇంటర్నేషనల్ ఆర్మ్స్ ట్రాన్స్‌ఫర్స్-2025' నివేదిక ప్రకారం.. గత ఐదేళ్లతో (2016-20) పోలిస్తే 2021-25 మధ్యకాలంలో భారత్ ఆయుధ దిగుమతులు 4.0 శాతం తగ్గాయి. దేశీయంగా ఆయుధాలను డిజైన్ చేసి, తయారు చేసే సామర్థ్యం పెరగడమే ఇందుకు ఒక కారణంగా నివేదిక పేర్కొంది. అయితే, దేశీయ ఉత్పత్తిలో తరచూ జరుగుతున్న జాప్యం వల్ల విదేశీ సరఫరాదారులపై ఆధారపడటం కొనసాగుతోందని కూడా తెలిపింది. ఫ్రాన్స్ నుంచి 140 యుద్ధ విమానాలు, జర్మనీ నుంచి 6 జలాంతర్గాముల కొనుగోలుకు ఇటీవల కుదుర్చుకున్న ఒప్పందాలు ఇందుకు నిదర్శనమని వివరించింది. గత దశాబ్ద కాలంగా భారత్ తన ఆయుధాల కొనుగోళ్ల కోసం రష్యాపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, పశ్చిమ దేశాల వైపు మొగ్గు చూపుతోంది. 2021-25 మధ్య కాలంలో భారత్‌కు రష్యా అతిపెద్ద ఆయుధ సరఫరాదారుగా ఉన్నప్పటికీ, దాని వాటా 40 శాతానికి పడిపోయింది. గతంలో ఇది 70 శాతం వరకు ఉండేది. ఇదే సమయంలో ఫ్రాన్స్ (29 శాతం), ఇజ్రాయెల్ (15 శాతం) నుంచి భారత్ దిగుమతులు గణనీయంగా పెరిగాయి. చైనా, పాకిస్థాన్‌లతో ఉన్న ఉద్రిక్తతల కారణంగానే భారత్ తన ఆయుధ దిగుమతులను కొనసాగిస్తోందని సిప్రి నివేదిక విశ్లేషించింది. మరోవైపు, పాకిస్థాన్ ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుగా (4.2 శాతం వాటా) ఉంది. గత ఐదేళ్లతో పోలిస్తే పాకిస్థాన్ దిగుమతులు 66 శాతం పెరిగాయి. పాకిస్థాన్‌కు చైనా 80 శాతం ఆయుధాలను సరఫరా చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అమెరికా 42 శాతం వాటాతో అతిపెద్ద ఆయుధ ఎగుమతిదారుగా తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. ఫ్రాన్స్ (9.8 శాతం) రెండో స్థానంలో నిలవగా, రష్యా మూడో స్థానానికి పరిమితమైంది.



## అందుబాటులో 50 విమానాలు

### భారత పౌరుల తరలింపుపై కేంద్రం వివరణ

న్యూఢిల్లీ: ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా పశ్చిమాసియాలో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి తీసుకురావడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తున్నామని పౌర విమానయాన శాఖ వెల్లడించింది. పశ్చిమాసియాలోని పలు ప్రాంతాల నుంచి 50 విమానాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపింది. గత రెండు రోజుల్లో 100 సర్వీసుల్లో ప్రయాణికులను సురక్షితంగా తరలించినట్లు వెల్లడించింది. దుబాయ్, అబుదాబీ, రస్ అల్ ఖైమా, పుజరాహ్, మస్కట్, జెద్దాల నుంచి విమానాలు సురక్షితంగా నడిచినట్లు పౌర విమానయాన శాఖ తన ప్రకటనలో తెలిపింది. ఆయా విమానాశ్రయాల్లో పరిస్థితులు, సాధ్యాసాధ్యాలకు అనుగుణంగా విమానాలు నడుస్తున్నట్లు వెల్లడించింది. టిక్కెట్ ధరలు సహేతుకంగా ఉండేలా విమాన ఛార్జీలను కూడా నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపింది.

## ఇరాన్ సరిహద్దులకు వెళ్లొద్దు

### ఇరాన్‌లోని భారతీయులకు కేంద్రం అలర్ట్

టెహ్రాన్: పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం ఇరాన్‌లో నివసిస్తున్న భారతీయులకు సోమవారం ఒక కీలక సూచన జారీ చేసింది. తమతో ముందుగా సంప్రదించకుండా దేశం విడిచి వెళ్లేందుకు ఏ భూ సరిహద్దు వైపు వెళ్లవద్దని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. "భారత పౌరులు ఎంబసీ నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు పొందిన తర్వాతే సరిహద్దుల వైపు ప్రయాణించాలి. ఒకవేళ ఇరాన్ భూభాగం విడిచిపెట్టాక, పొరుగు దేశంలోకి ప్రవేశం లభించక ఇబ్బందులు పడితే, ఆ తర్వాత మేం ఎలాంటి సహాయం అందించలేము" అని రాయబార కార్యాలయం తన ప్రకటనలో పేర్కొంది. అత్యవసర సహాయం కోసం హెల్ప్‌లైన్ నంబర్లు లేదా ఈ-మెయిల్ ద్వారా తమను సంప్రదించాలని సూచించింది. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు ప్రారంభించినప్పటి నుంచి పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా డ్రోన్లు, క్షిపణులతో ఎదురుదాడులకు దిగుతోంది. ఈ నేపథ్యంలోనే భారత ఎంబసీ ఈ అడ్వైజరీ జారీ చేసింది. మరోవైపు, ఇరాన్ దాడులను సౌదీ అరేబియా తీవ్రంగా ఖండించింది. ఇది ప్రాంతీయ భద్రతకు పెను ముప్పు అని, ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించింది. తమ దాడులు ఆత్మరక్షణ కోసమేనని, పొరుగు దేశాల నుంచే తమపైకి క్షిపణులు ప్రయోగిస్తున్నారని ఇరాన్ వాదిస్తోంది. ఈ ఆరోపణలను సౌదీ అరేబియా తోసిపుచ్చింది.

## బంగ్లాదేశ్‌లో వర్సిటీలు బంద్!

ఢాకా: పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధం కారణంగా ఏర్పడిన అంతర్జాతీయ ఇంధన సంక్షోభం బంగ్లాదేశ్‌ను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. దేశవ్యాప్తంగా విద్యుత్, ఇంధనాన్ని ఆదా చేసే చర్యల్లో భాగంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలను మూసివేస్తున్నట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. రంజాన్ (ఈద్ ఉల్-ఫితర్) పండుగ ముగిసే వరకు ఈ సెలవులు కొనసాగుతాయని విద్యాశాఖ స్పష్టం చేసింది. జాతీయ స్థాయిలో విద్యుత్, ఇంధనాన్ని ఆదా చేయాల్సిన అవసరం ఉందని, వర్సిటీల్లోని అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్థానిక పత్రిక 'ప్రోథోమ్ అలో' వెల్లడించింది. దీనికోసం వాహనాల వినియోగం తగ్గించడం సహా 11 కీలక మార్గదర్శకాలను విద్యాశాఖ జారీ చేసింది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ దళాలు జరిపిన సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించడం, ఆ తర్వాత ఇరాన్ తీవ్రస్థాయిలో ప్రతీకార దాడులకు దిగడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. ఈ పరిణామాల ప్రభావం గ్లోబల్ ఎనర్జీ మార్కెట్లపై పడింది. దీంతో బంగ్లాదేశ్‌లో ఇంధన కొరత వస్తుందన్న భయంతో ఢాకా, ఛట్టోగ్రామ్ తదితర ప్రాంతాల్లో వాహనదారులు పెట్రోల్ బంకుల వద్ద భారీగా క్యూ కడుతున్నారు.

# నేపాల్ ఎన్నికల్లో ఆర్ఎస్పీ ప్రభంజనం

### పాత పార్టీలను తుడిచిపెట్టిన బాలెన్ షా పార్టీ



ఖాట్మండు: నేపాల్ రాజకీయాల్లో చారిత్రక శకం ఆవిష్కృతమైంది. కేవలం మూడున్నరేళ్ల క్రితం ఆవిర్భవించిన రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్ఎస్పీ), పార్లమెంట్ ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించింది. దశాబ్దాలుగా పాతుకుపోయిన సంప్రదాయ పార్టీలను తుడిచిపెడుతూ, సోమవారం సాయంత్రానికి వెలువడిన ఫలితాల్లో తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఫస్ట్-పాస్ట్-ది-పోస్ట్ (ఎఫ్‌పీటీపీ) విధానంలో 165 స్థానాలకు గాను 163 స్థానాల ఓట్ల లెక్కింపు పూర్తి కాగా, ఆర్ఎస్పీ ఏకంగా 125 సీట్లలో విజయభేరి మోగించింది. ఈ ఎన్నికల సునామీలో మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీ సహా ఎందరో రాజకీయ హేమాహేమీలు ఓటమి పాలయ్యారు. ఆర్ఎస్పీ ప్రధాని అభ్యర్థి, ఖాట్మండు మాజీ మేయర్ బాలెన్ షా.. ఓలీకి కంచుకోటగా భావించే ఝాపా-5 నియోజకవర్గంలో ఆయనపై ఘనవిజయం సాధించారు. నేపాల్ పార్లమెంటరీ చరిత్రలోనే ఏ అభ్యర్థికి రానన్ని అత్యధికంగా 68,348 ఓట్లను బాలెన్ షా దక్కించుకోవడం విశేషం. మరోవైపు, నేపాలీ కాంగ్రెస్ ప్రధాని అభ్యర్థిగా భావించిన గగన్ థాపా కూడా ఆర్ఎస్పీ అభ్యర్థి చేతిలో ఓటమి చెందారు. ఎఫ్‌పీటీపీ విధానంలోనే కాకుండా, దామాషా ప్రాతినిధ్య (ప్రపోర్షనల్ రిప్రజెంటేషన్) పద్ధతిలోనూ ఆర్ఎస్పీ 48 శాతానికి పైగా ఓట్లతో ఆధిక్యంలో ఉంది. ఈ ట్రెండ్ కొనసాగితే, 275 మంది సభ్యులున్న ప్రతినిధుల సభలో ఆర్ఎస్పీ దాదాపు మూడింట రెండొంతుల మెజారిటీతో (సుమారు 184 సీట్లు) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంది. 1991 తర్వాత ఏ ఒక్క పార్టీ కూడా ఇంతటి భారీ మెజారిటీని సాధించలేదు. సంప్రదాయ పార్టీల పాలనలో పెరిగిన అవినీతి, బంధుప్రీతి, ఆర్థిక వైఫల్యాలపై ప్రజల్లో తీవ్రమైన ఆగ్రహం వ్యక్తమైందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. "ప్రజా సంస్థలలో నిపుణులకు బదులుగా పార్టీలకు దగ్గరైన వారిని నియమించడం వంటి దుష్పరిపాలనపై ప్రజలు విసిగిపోయారు. పాత పార్టీల నాయకత్వం తమ అహంకారాన్ని వీడకపోవడమే ఈ ఫలితాలకు కారణం," అని రాజకీయ విశ్లేషకుడు రాజేంద్ర మహర్జన్ వ్యాఖ్యానించారు. గత కొన్నేళ్లుగా దేశ ఆర్థిక వ్యవస్థ మందగించడం, యువతకు ఉద్యోగాలు లేకపోవడం, ఉపాధి కోసం పెద్ద సంఖ్యలో విదేశాలకు వలస వెళ్లడం వంటి అంశాలు పాత నాయకత్వంపై వ్యతిరేకతను పెంచాయి. ఈ అంశాలన్నీ కలిసి కొత్త రాజకీయ శక్తి ఆవిర్భావానికి మార్గం సుగమం చేశాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ చారిత్రక తీర్పుతో నేపాల్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలైంది.

# ఆగదు ఈ యుద్ధం

### ఇరాన్‌పై ఇజ్రాయెల్ మళ్లీ దాడులు

### అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రతిదాడులు



టెహ్రాన్: గత తొమ్మిది రోజులుగా కొనసాగుతున్న ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ఇప్పట్లో ఆగే సూచనలు కనిపించడం లేదు. సోమవారం ఇజ్రాయెల్ సైన్యం ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించింది. బీరూట్‌లో హిజ్బుల్లా మౌలిక వసతులపై కూడా దాడి చేసింది. దీనికి ముందు రోజు టెహ్రాన్ చమురు నిల్వ కేంద్రాలపై ఇజ్రాయెల్ దాడి చేసింది. ఇరాన్ ప్రతిగా ఇజ్రాయెల్‌పై, పశ్చిమాసియాలో అమెరికా సైనిక స్థావరాలు ఉన్న ప్రాంతాలపై దాడులు చేస్తోంది. ఆదివారం సౌదీ అరేబియాలోని ఓ నివాస ప్రాంతంలో ఒక ఆయుధం పడటంతో ఒక భారతీయుడు సహా ఇద్దరు విదేశీయులు మరణించారు. ఇజ్రాయెల్, అమెరికా దాడుల్లో మొజ్తబా తండ్రి అలీ ఖమేనీతో పాటు తల్లి, కుమారుడు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్ మీడియా నివేదికల ప్రకారం.. మొజ్తబా భార్య పేరు జహ్రా హద్దాద్-అదెల్, ఆయన కుమారుల్లో ఒకరు దాడుల్లో మరణించారు. మొజ్తబాకు ఒక కుమార్తె కూడా ఉంది. మొత్తం ముగ్గురు పిల్లలు. ప్రజల ముందుకు మొజ్తబా ఖమేనీ అంతగా రారు. తన 56 సంవత్సరాల జీవితంలో అదే తీరును అవలంభించారు. అయితే, ఇరాన్‌లో చెలరేగిన నిరసనలను అణచివేయడంలో మొజ్తబా పాత్ర ఉంది.


# 74 రోజులకు సరిపడా చమురు

**రాజ్యసభలో కేంద్ర మంత్రి సురేష్ గోపి వెల్లడి.. ఒడిశా, కర్ణాటకలో కొత్తగా 2 స్టోరేజ్ ప్లాంట్లు**



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలు, అనుకోని విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు చమురు సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా భారత్ ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం దేశంలో 74 రోజులకు సరిపడా ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల నిల్వలు ఉన్నట్లు పెట్రోలియం, సహజ వాయువుల శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి సోమవారం రాజ్యసభకు లిఖితపూర్వకంగా తెలిపారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం 5.33 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎంఎంటీ) సామర్థ్యంతో వ్యూహాత్మక పెట్రోలియం రిజర్వ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇవి 9.5 రోజుల ముడి చమురు అవసరాలను తీర్చగలవు. దీనికి తోడు దేశంలోని చమురు మార్కెటింగ్ సంస్థల వద్ద 64.5 రోజులకు సరిపడా చమురు నిల్వలు ఉన్నాయని, మొత్తంగా దేశంలో 74 రోజుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని మంత్రి వివరించారు. చమురు నిల్వల సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో ఒడిశాలోని చండీఖోల్ (4 ఎంఎంటీ), కర్ణాటకలోని పాదూర్ (2.5 ఎంఎంటీ) వద్ద 6.5 ఎంఎంటీ సామర్థ్యంతో రెండు కొత్త ప్లాంట్ల ఏర్పాటుకు 2021 జూలైలోనే కేంద్రం ఆమోదం తెలిపింది. ఇవి అందుబాటులోకి వస్తే అదనంగా మరో 12 రోజులకు సరిపడా చమురు నిల్వలు పెరుగుతాయి. మరోవైపు దిగుమతులపరంగా ఎలాంటి సమస్యలు రాకుండా ఇంధన సరఫరా మార్గాలను విస్తరించడం, ఘర్షణలు జరిగే ప్రాంతాలను మినహాయించి ఇతర మార్గాల ద్వారా రవాణా చేయడం వంటి చర్యలు తీసుకుంటోంది. అలాగే చమురు ఉత్పత్తి దేశాలు, అంతర్జాతీయ సంస్థలతో దౌత్యపరమైన సంబంధాలను పటిష్ఠం చేసుకుంటోంది. దేశంలో చమురు, సహజ వాయువుల అన్వేషణ కూడా నిరంతరం కొనసాగుతోందని మంత్రి వివరించారు. 2025 ఏప్రిల్ 1 నాటికి దేశంలో 423.1 ఎంఎంటీ ముడి చమురు, 595.4 బిలియన్ క్యూబిక్ మీటర్ల (బీసీఎం) సహజ వాయువుల నిల్వలు వెలికితీసేందుకు వీలుగా ఉన్నాయని అంచనా వేశారు. గత ఐదేళ్లలో మన దేశం ముడి చమురు కోసం 85 నుంచి 88 శాతం, ఎల్ఎన్‌జీ కోసం 48 నుంచి 50 శాతం దిగుమతులపై ఆధారపడినట్లు మంత్రి సురేష్ గోపి స్పష్టం చేశారు.

# బంగ్లాదేశ్‌లో హిందూ బాలుడి దారుణ హత్య




ఢాకా: బంగ్లాదేశ్‌లో మైనారిటీలైన హిందువులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఫెనీ జిల్లాలో ఆటోను దొంగిలించేందుకు యత్నించిన కొందరు దుండగులు, 16 ఏళ్ల హిందూ బాలుడిని దారుణంగా హత్య చేశారు. ఢాకా-చిట్టగాంగ్ హైవేపై లాల్‌పోల్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. మృతుడిని శాంతో కుమార్ సాహాగా గుర్తించారు. స్థానిక మీడియా 'జాగోన్యూస్24' కథనం ప్రకారం.. మియాజీ ఫిల్లింగ్ స్టేషన్ ముందు ఆటోలో ప్రయాణికుడి కోసం శాంతో ఎదురుచూస్తున్నాడు. కాసేపటికి కొందరు దుండగులు అతడిపై దాడి చేసి, ఆటోను లాక్కునే క్రమంలో హైవే పక్కన ఉన్న కల్వర్టు కిందకి విసిరేశారు. అక్కడి నుంచి తేరుకుని దొంగలను వెంబడించిన శాంతోను వారు కదులుతున్న వాహనం కిందకి తోసేశారు. దీంతో వాహనం ఢీకొని బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. రాత్రి వరకు బాలుడి ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యులు గాలిస్తుండగా, తెలిసిన ఆటో డ్రైవర్ ద్వారా సమాచారం అందినట్లు శాంతో బంధువులు తెలిపారు. ప్రయాణికులను ఎక్కించుకున్న ప్రాంతంలో సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తే నిందితులను గుర్తించవచ్చని వారు కోరుతున్నారు. ఇఫ్తార్ సమయంలో ఉన్న ప్రశాంత వాతావరణాన్ని ఆసరాగా తీసుకుని బాలుడిని టార్గెట్ చేసి ఆటోను హైజాక్ చేశారని వారు ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో కొత్తగా ఏర్పడిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్ పీ) ప్రభుత్వ హయాంలోనూ హిందూ వర్గాలపై దాడులు ఆందోళనకరంగా పెరుగుతుండటం గమనార్హం. గతంలో మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వ 18 నెలల పాలనలోనూ మైనారిటీలపై దాడులు కొనసాగిన విషయం తెలిసిందే.

దేశంలో మొత్తం 53 చీతాలు

కూనోలో కొత్తగా ఐదు కూనలు జననం

భారత్‌లో పుట్టినవి 33.. 'జ్వాల' ప్రాజెక్టు సక్సెస్

భోపాల్: భారత్‌లో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రాజెక్ట్ చీతా' మరో కీలక మైలురాయిని అందుకుంది. మధ్యప్రదేశ్‌లోని కూనో నేషనల్ పార్క్‌లో ఇవాళ 'జ్వాల' అనే ఆడ చీతా ఐదు కూనలకు జన్మనిచ్చింది. దీంతో దేశంలో చీతాల సంతతి మరింత పెరిగింది. ఈ కొత్త కూనల రాకతో భారత్‌లో పుట్టిన చీతా పిల్లల మొత్తం సంఖ్య 33కు చేరుకోగా, దేశంలోని మొత్తం చీతాల సంఖ్య 53కి పెరిగింది. ఈ శుభవార్తను కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. ఇది 'ప్రాజెక్ట్ చీతా'కు గర్వకారణమని ఆయన అభివర్ణించారు. "విజయవంతంగా మూడోసారి తల్లి అయిన 'జ్వాల', కూనో నేషనల్ పార్క్‌లో ఐదు కూనలకు జన్మనిచ్చింది. ఇది భారతదేశ వన్యప్రాణి సంరక్షణ ప్రయత్నాలలో మరొక మైలురాయి. ఈ జననంతో భారతదేశంలో పుట్టి ఆరోగ్యంగా పెరుగుతున్న చీతా పిల్లల సంఖ్య 33కి పెరిగింది. భారత గడ్డపై ఇది 10వ విజయవంతమైన చీతా జననం" అని ఆయన తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ ప్రాజెక్ట్ విజయం కోసం క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమిస్తున్న పశువైద్యులు, అటవీ అధికారులు, సిబ్బంది అంకితభావానికి ఇది నిదర్శనమని ఆయన కొనియాడారు. మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ కూడా ఈ పరిణామంపై సంతోషం వ్యక్తం చేశారు. ఇది వన్యప్రాణుల సంరక్షణలో ఒక చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు. "జ్వాల చీతా ఐదు కూనలకు జన్మనివ్వడం ప్రాజెక్ట్ చీతాలో మరో గొప్ప విజయం. దీనితో భారతదేశంలో చీతాల జనాభా హాఫ్ సెంచరీ మార్కును దాటి 53కి చేరుకుంది" అని ఆయన తెలిపారు. ఇది దేశానికి గర్వకారణమని, చీతాల పునఃప్రవేశ కార్యక్రమం విజయవంతమవుతోందనడానికి బలమైన నిదర్శనమని ఆయన అన్నారు. 2022 సెప్టెంబర్ 17న నమీబియా నుంచి తొలి విడతలో భారత్‌కు తీసుకొచ్చిన ఎనిమిది చీతాల్లో 'జ్వాల' ఒకటి. భారత్‌కు వచ్చినప్పటి నుంచి ఇది మూడోసారి పిల్లలకు జన్మనివ్వడం విశేషం. కాగా, గత నెలలోనే 'గామిని' అనే మరో చీతా కూనో పార్క్‌లో నాలుగు కూనలకు జన్మనిచ్చింది. అలాగే, ఫిబ్రవరి 28న బోట్స్వానా నుంచి ఆరు ఆడ, మూడు మగ చీతాలతో కూడిన మూడో బ్యాచ్‌ను కూనో పార్క్‌లోకి విడుదల చేసిన కొద్దిరోజులకే ఈ శుభవార్త వెలువడటం గమనార్హం.




## 'బ్రహ్మోస్'కు డిమాండ్

### తాజాగా ఇండోనేషియా డీల్

ఆపరేషన్ సిందూర్ తర్వాత పెరిగిన ఆసక్తి

న్యూఢిల్లీ: భారత రక్షణ ఎగుమతులకు మరో పెద్ద విజయం దక్కింది. అత్యంత శక్తివంతమైన బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి వ్యవస్థను కొనుగోలు చేసేందుకు ఇండోనేషియా ముందుకు వచ్చింది. ఈ మేరకు భారత్‌తో ఒప్పందం కుదిరినట్టు ఇండోనేషియా రక్షణ మంత్రిత్వ శాఖ సోమవారం అధికారికంగా ప్రకటించింది. సముద్ర రంగంలో సైనిక హార్డ్‌వేర్‌ను ఆధునికీకరించడంతో పాటు, రక్షణ సామర్థ్యాలను పెంపొందించుకోవడంలో భాగంగానే ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఇండోనేషియా రక్షణ శాఖ అధికార ప్రతినిధి రికో రికార్డో సిరైత్ 'రాయిటర్స్' వార్తా సంస్థకు వివరించారు. చాలాకాలంగా సాగుతున్న చర్చలు, 2025లో ఇరు దేశాల రక్షణ మంత్రుల మధ్య జరిగిన ఉన్నతస్థాయి సమావేశం తర్వాత ఈ ఒప్పందంపై వేగంగా పురోగతి సాధించారు. భారత్ నుంచి బ్రహ్మోస్ క్షిపణులను కొనుగోలు చేస్తున్న రెండో విదేశీ దేశం ఇండోనేషియా. 2022లోనే ఫిలిప్పీన్స్ 375 మిలియన్ డాలర్ల ఒప్పందంతో మూడు బ్రహ్మోస్ బ్యాటరీలను కొనుగోలు చేయగా, 2024లో తొలి విడత డెలివరీలు పూర్తయ్యాయి. భారత్, రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ బ్రహ్మోస్ క్షిపణిని భూమి, గగనతలం, నౌకలు, జలాంతర్గాముల నుంచి కూడా ప్రయోగించవచ్చు. ఇటీవల 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ వైమానిక స్థావరాలపై జరిపిన దాడుల్లో బ్రహ్మోస్ అద్భుతమైన ఫలితాలను ఇచ్చింది. ఈ క్షిపణి విజయం తర్వాత భారత నౌకాదళం, వాయుసేన కోసం మరిన్ని బ్రహ్మోస్ సిస్టమ్‌ల కొనుగోలుకు రక్షణ శాఖ ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో బ్రహ్మోస్ క్షిపణిపై అంతర్జాతీయంగా ఆసక్తి పెరిగింది.

## జమిలి రాష్ట్రాలకు డేంజర్: ఎంకే స్టాలిన్

చెన్నై: వన్ నేషన్ వన్ ఎలక్షన్ (జమిలి ఎన్నికలు) వల్ల రాష్ట్ర ఎన్నికల ప్రాధాన్యత తగ్గిపోతుందని, కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి అధికారాలన్నీ వెళతాయని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మండిపడ్డారు. జమిలి ఎన్నికల విధానంపై ఆయన స్పందిస్తూ, ఈ విధానం దేశానికి ఒక పరిష్కారం చూపిస్తుందేమో కానీ, అసలు సమస్య కంటే దారుణమైన పరిణామాలకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. లోక్ సభకు, రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు జరపడమంటే భారతదేశ సమాఖ్య నిర్మాణం, ప్రజాస్వామ్య వైవిధ్యం దెబ్బతింటుందని అన్నారు. రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు కాలరాసినట్లవుతుందని విమర్శించారు. జమిలి ఎన్నికలు జరిగితే జాతీయ స్థాయి పార్టీలకే ప్రయోజనం చేకూరుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాంతీయ సమస్యలు, ప్రజల మనోభావాలు పక్కకు వెళతాయని అన్నారు. కేవలం ఖర్చు తగ్గుతుందనే కారణంతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయకూడదని అన్నారు.

## ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు ఢిల్లీ సేఫ్ కాదు

### బీజేపీ ఎంపీ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ తపిర్ గావో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలోని ఈశాన్య రాష్ట్రాల ప్రజల భద్రతపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తమ ప్రజలకు ఢిల్లీ సురక్షితం కాదని ఆయన అన్నారు. దేశ రాజధానిలో జాతి వివక్ష, దాడుల సంఘటనలు ఆందోళనకరమని పేర్కొన్నారు. ఈ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతానని అన్నారు. ఈశాన్య ప్రాంతానికి చెందిన ప్రజల రక్షణకు బలమైన చట్టపరమైన చట్రాలు అవసరమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతోపాటు బీజేపీ ప్రభుత్వం ఉన్న దేశ రాజధానిలో ఈశాన్య ప్రజలపై జరుగుతున్న దాడుల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజలపై జాతి వివక్షత చూపడంతోపాటు దాడులు జరుగుతున్నాయని అన్నారు. ఢిల్లీలోనే కాదు, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మెట్రోపాలిటన్ నగరాల్లో కూడా ఈశాన్య ప్రాంతాల ప్రజలు జాతి వివక్ష, దాడులు, హత్యలను ఎదుర్కొంటున్నారని వాపోయారు. కేంద్ర హోంమంత్రిని కలిసి అట్రాసిటీ లాంటి చట్టాన్ని తీసుకురావాలని కోరతామని తపిర్ గావో అన్నారు.

## ఇరాన్ క్షిపణి దాడిలో భారత పౌరుడికి గాయాలు

జెరూసలెం: ఇరాన్ క్షిపణి దాడి కారణంగా ఇజ్రాయెల్‌లో ఒక భారత పౌరుడికి గాయాలయ్యాయి. ఇరాన్ క్షిపణి నుంచి వచ్చిన శకలాలు తగలడం వల్ల అతడి మెడకు తీవ్ర గాయమైనట్లు ఇజ్రాయెల్ అధికారులు వెల్లడించారు. ఆదివారం ఈ ఘటన జరిగిన వెంటనే అతనిని టెల్‌అవివ్‌లోని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అక్కడే ఆపరేషన్ జరిగిందని, ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వెల్లడించారు. బాధితుడి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. టెల్‌అవివ్‌లోని భారత ఎంబసీ అధికారులు ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు.

వయ్యారి చిత్రం



అనన్య పాండే

## ప్రీమియర్స్‌తోనే 'దురంధర్ 2' షేకింగ్

మార్చి 19న రాబోతున్న 'దురంధర్-2' మీద అంచనాలు తారాస్థాయికి చేరాయి. విడుదలకు ముందు రోజు సాయంత్రం దేశవ్యాప్తంగా పెయిడ్ ప్రీమియర్స్ ఫిక్స్ చేస్తూ.. 12 రోజుల ముందే అడ్వాన్స్ బుకింగ్స్‌ను చిత్ర బృందం మొదలుపెట్టేసింది. దీంతో ఒక్కసారిగా బుక్ మై షో షేకైపోయింది. రేపో, ఎల్లుండో సినిమా రిలీజవుతున్నట్లుగా జనం ఎగబడి ప్రీమియర్స్ టికెట్లు కొంటున్నారు. దేశవ్యాప్తంగా ఈ సినిమాకు డిమాండ్ మామూలుగా లేదు. హైదరాబాద్‌లో పెయిడ్ ప్రీమియర్స్ షోల బుకింగ్స్ స్టేటస్ చూస్తే షాక్ అవ్వాల్సి వస్తోంది. టాలీవుడ్ టాప్ స్టార్ల సినిమాల రేంజ్‌లో టికెట్లు అమ్ముడవుతున్నాయి. 'దురంధర్-2' రిలీజ్ రోజే తెలుగు నుంచి పవన్ కళ్యాణ్ సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్' రిలీజ్ కాబోతోంది. దానికీ ముందు రోజు పెయిడ్ ప్రీమియర్స్ వేయబోతున్నారు. ఐతే ఆ షోలకు స్పెషల్ రేట్లు తెచ్చుకునే ప్రయత్నంలో ఉంది టీం. కానీ కోర్టు ఆదేశాల కారణంగా అది అంత తేలిగ్గా సాధ్యమయ్యేలా లేదు.






## బెల్లంకొండ పెళ్లికి.. కొండంత బడ్జెట్!?

టాలీవుడ్ యంగ్ హీరో, అల్లుడు శీను ఫేమ్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ త్వరలోనే ఒక ఇంటివాడు కాబోతున్నారు. తన మనసు గెలుచుకున్న కావ్య రెడ్డిని ప్రపంచానికి పరిచయం చేస్తూ.. తాను వివాహ బంధంలోకి అడుగుపెడుతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. శీను తండ్రి, ప్రముఖ నిర్మాత బెల్లంకొండ సురేష్ ప్రెస్టేజ్ లో ఎక్కడా తగ్గరు. ఆ ఇద్దరు హీరోలకు ధీటుగా తన కుమారుడి వివాహం కోసం అత్యంత భారీగా ఆయన బడ్జెట్‌ను కేటాయిస్తారని అంచనా వేస్తున్నారు. శీను సినిమాల కోసం బెల్లంకొండ సురేష్ నిర్మించిన భారీ సెట్లు, వాటి బడ్జెట్లు చూసిన వారికి.. అంతకుముందు ఏ స్టార్ హీరోకి కానీ, ఏ నటవారసుడికి కానీ ఈ రేంజు సెట్లు లేవు అని అంగీకరించారు. అలాంటిది ఇప్పుడు కుమారుడు లైఫ్ లో సెటిలవుతున్నాడంటే ఏ నటవారసుడి పెళ్లికి తీసిపోని రేంజులో ఈ పెళ్లి ఉంటుందని అంచనా వేస్తున్నారు. కాబోయే కోడలిని సాదరంగా ఆహ్వానిస్తూ, ఈ పెళ్లి వేడుకను ఒక పండగలా నిర్వహించేందుకు బెల్లంకొండ సురేష్ భారీ బడ్జెట్‌ను కేటాయించినట్లు అంచనా వేస్తున్నారు.



## షూటింగ్‌లతో బిజీగా 'కొండన్న'!

పెళ్లయి పక్షం రోజులు కూడా గడవకముందే విరోష్ జంట తమ సినిమా షూటింగ్లో పాల్గొనబోతున్నట్లు సమాచారం. వివరాలలోకి వెళ్తే.. దాదాపు 8 సంవత్సరాల పాటు రహస్యంగా ప్రేమాయణం కొనసాగించిన ఈ జంట.. ఎట్టకేలకు ఫిబ్రవరి 26 2026న ఉదయపూర్ హిందూ, కొడవ సాంప్రదాయ పద్ధతుల్లో వివాహం జరిగిన విషయం తెలిసిందే. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం.. వివాహం జరిగి 15 రోజులు కూడా కాలేదు. అప్పుడే సినిమా సెట్ లోకి అడుగుపెట్టనున్నట్లు సమాచారం. ప్రముఖ డైరెక్టర్ రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న రణబాలి సినిమా షూటింగ్లో ఈనెల 12 నుంచి పాల్గొనబోతున్నట్లు తెలుస్తోంది. కర్నూలులో జరిగే ఈ షెడ్యూల్లో కీలక నటీనటులంతా కూడా పాల్గొంటారని సమాచారం. వేగంగా షూటింగ్ ను కంప్లీట్ చేసి సెప్టెంబర్ 11న విడుదల చేయాలని చూస్తున్నారు.

## 13న ఓటీటీలోకి భర్త మహాశయులకు విజ్ఞప్తి

మాస్ మహారాజ్ రవితేజ నటించిన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ భర్త మహాశయులకు విజ్ఞప్తి ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. సంక్రాంతి సందర్భంగా జనవరి 13న థియేటర్లలో రిలీజైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోకపోయినా, ఇప్పుడు డిజిటల్ వేదికపై కొత్త అవకాశాన్ని అందుకోవడానికి సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5 ఈ సినిమాను మార్చి 13 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. సాధారణంగా ఇటీవల విడుదలైన పెద్ద సినిమాలు థియేటర్లలో రిలీజైన నెలరోజుల్లోనే ఓటీటీకి చేరుతున్న నేపథ్యంలో, భర్త మహాశయులకు విజ్ఞప్తి మాత్రం దాదాపు రెండు నెలల తర్వాత డిజిటల్ ప్రీమియర్‌కు రావడం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సంక్రాంతి సందర్భంగా మొత్తం ఐదు సినిమాలు విడుదల కాగా, వాటిలో అన్ని సినిమాలు దాదాపు ఇప్పటికే ఓటీటీలోకి వచ్చాయి. అయితే ఈ సినిమా మాత్రం ఆలస్యంగా స్ట్రీమింగ్‌కు వస్తుండటం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది.






## త్రిష.. ఏందీ రచ్చ?

కోలీవుడ్ ఇండస్ట్రీలో స్టార్ హీరో విజయ్, హీరోయిన్ త్రిష చుట్టూ జరుగుతున్న చర్చలు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి. వీరిద్దరి గురించి వస్తున్న వార్తలు, వాటిపై వస్తున్న పొలిటికల్ కామెంట్స్, సోషల్ మీడియాలో ఆర్గ్యుమెంట్స్.. ఇప్పుడు తమిళ సినీ, రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీస్తున్నాయి. ఈ నేపథ్యంలో త్రిష రెస్పాన్స్ పై కూడా రకరకాల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఒక రాజకీయ నాయకుడు విజయ్, త్రిష గురించి వ్యాఖ్యలు చేయడం వివాదానికి దారితీసింది. ఆ కామెంట్స్ పై త్రిష రెస్పాండ్ అవుతూ.. అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించినట్లు వార్తలు వచ్చాయి. అదే సమయంలో మరోవైపు విజయ్ వ్యక్తిగత జీవితం గురించి కూడా కొన్ని రోజులుగా పలు వార్తలు బయటకు వస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఆయన భార్య సంగీత విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నారని, చెంగల్పట్టు కోర్టులో పిటిషన్ వేశారని, దానికి ఒక నటి కారణమని ప్రచారం సోషల్ మీడియాలో కొన్ని రోజులుగా జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో విజయ్, త్రిష కలిసి ఒక పబ్లిక్ ఈవెంట్‌కు కలిసి హాజరవడం మరింత చర్చకు దారితీసింది. ఇటీవల నటుడు పార్తీబన్.. కుందవై (పొన్నియన్ సెల్వన్ లో త్రిష పాత్ర పేరు) ఇంట్లోనే ఉండాలని, అప్పుడు ఎలాంటి సమస్యలు రావని అన్నారు. అయితే వాటిపై త్రిష పరోక్షంగా గట్టి కౌంటర్ ఇచ్చింది. త్రిష దూకుడు విజయ్ రాజకీయాలకు ఇబ్బందిగా మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## బేబీ జంట.. ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్!

టాలీవుడ్ యంగ్ క్యాస్టింగ్ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఎపిక్- ఫస్ట్ సెమిస్టర్ నుంచి రిలీజ్ అయిన ఫస్ట్ సింగిల్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా



మారింది. సంచారమే అంటూ సాగుతున్న ఆ పాట మంచి రెస్పాన్స్ అందుకుంటా.. సూపర్ మెలోడీగా మెప్పిస్తోంది. సినిమా కథలోని మెయిన్ రోల్స్ ఎమోషనల్ జర్నీని సాంగ్ క్లియర్ గా చూపిస్తోంది. ఆ పాటకు ప్రముఖ కవి, రైటర్ గోరటి వెంకన్న లిరిక్స్ అందించగా.. ప్యూర్ తెలుగు పదాలు, హృదయాన్ని తాకే భావాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇండియన్ కల్చర్, ఫారిన్ లైఫ్ స్టైల్ మధ్య ఉండే తేడాలను సింపుల్ గా వ్యక్తపరుస్తూ సంచారమే పాట సాగుతుంది. సినిమా స్టోరీకి అనుగుణంగా, యూత్ మనసుల్లోని ఫీలింగ్స్ వ్యక్తపరిచేలా సాంగ్ ను రూపొందించినట్లు చిత్రబృందం తెలిపింది. సంచారమే పాటకు ప్రముఖ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ బాణీలు కట్టారు.

## ఇండియన్ 3కి ముహూర్తం?

ఇండియన్ 2 దెబ్బతో ఇండియన్ 3 ఎలాంటి పరిస్థితుల్లోకి వెళ్లిపోయిందో తెలిసిందే. ఇండియన్ గ్రేట్ డైరెక్టర్ శంకర్ తెరకెక్కించిన సినిమా అయినా? జనాలు లైట్ తీసుకునే పరిస్థితికి వచ్చేసింది. శంకర్ పనైపోయింది. ఇంకేం సినిమాలు చేస్తాడులే అన్న విమర్శలు తీవ్ర స్థాయిలో వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇండియన్ 3 రిలీజ్ అవుతుందా? లేదా? అన్న ఎన్నో సందేహాలు తెరపైకి వచ్చాయి. ఒకవేళ రిలీజ్ అయినా థియేట్రికల్ గా రిలీజ్ అవుతుందా? ఓటీటీలో రిలీజ్ అవుతుందా? అన్న సందేహం నడుమ థియేటర్లోనే రిలీజ్ చేస్తామని క్లారిటీ ఇచ్చారు. ఇక రిలీజ్ విషయంలో రకరకాల కథనాలు వైరల్ అయ్యాయి. గత ఏడాదే రిలీజ్ అవుతుందని భావించారు.

## 'మిరాకిల్' నా కెరీర్ బెస్ట్: హెబ్బా పటేల్

సైదా ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌పై రమేష్ ఎగ్గిడి, శ్రీకాంత్ మొగదాసు, చందర్ గౌడ్ సంయుక్తంగా నిర్మిస్తున్న వినూత్న కథాచిత్రం 'మిరాకిల్'. ఇందులో రణధీర్ బీసు హీరోగా, హెబ్బా పటేల్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. సీనియర్ హీరోలు సురేష్, శ్రీరామ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రభాస్ నిమ్మల దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్రం మూడో షెడ్యూల్ హైదరాబాద్ పరిసర గ్రామమైన 'కొండమడుగు"లో పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా హీరోయిన్ హెబ్బా పటేల్ మాట్లాడుతూ.. 'కుమారి 21ఎఫ్, ఈడో రకం - ఆడో రకం, ఓదెల రైల్వే స్టేషన్ వంటి బ్లాక్ బస్టర్స్ నా కెరీర్‌లో ఎన్నో ఉన్నప్పటికీ... తాజాగా నేను చేస్తున్న 'మిరాకిల్' నా కెరీర్‌లో మోస్ట్ మెమరబుల్ మూవీ అవుతుంది. థాంక్స్ టు డైరెక్టర్ ప్రభాస్ నిమ్మల' అని అన్నారు.





# గంభీర్.. నీ నవ్వు బాగుంది: ధోనీ

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో విజేతగా నిలిచిన టీమిండియాకు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ అభినందనలు తెలిపాడు. ఆటగాళ్లు, సపోర్ట్ స్టాఫ్‌తో పాటు భారత క్రికెట్ అభిమానులందరికీ సోషల్ మీడియా వేదికగా విషెస్ చెప్పాడు. సాధారణంగా మొబైల్ ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండే ధోనీ.. భారత ప్రపంచకప్ విజయంపై ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించాడు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ చిరునవ్వు బాగుందని, దాన్ని అలానే కొనసాగించాలని సూచించాడు. 'అహ్మదాబాద్‌లో సరికొత్త చరిత్ర సృష్టించబడింది. టీమిండియాకు, సపోర్ట్ స్టాఫ్‌కు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారత క్రికెట్ అభిమానులందరికీ నా హృదయపూర్వక అభినందనలు. మీరందరూ ఆడుతుంటే చూడటం చాలా ఆనందంగా ఉంది. కోచ్ సాబ్.. మీ ముఖంలోని ఆ చిరునవ్వు చాలా బాగుంది. విజయం సాధించాలనే ఆయన పట్టుదల, ఆ చిరునవ్వు కిల్లర్ కాంబినేషన్. వెల్ డన్! ఈ విజయాన్ని ఆస్వాదించండి గైస్. బుమ్రా గురించి నేను ఏమీ రాయకపోవడమే మంచిది. అతను ఒక ఛాంపియన్ బౌలర్' అని పేర్కొన్నాడు.

## నిన్ను చూశాకే ఆ నవ్వు

ధోనీ పోస్ట్‌కు గంభీర్ రియాక్షన్

ధోనీ చేసిన సోషల్ మీడియా పోస్ట్‌కు గౌతమ్ గంభీర్ తనదైన శైలిలో స్పందించాడు. స్టేడియంలో ధోనీని చూడటంతోనే తన ముఖంలోకి చిరునవ్వు వచ్చిందని పేర్కొన్నాడు. 'ధోనీ.. మైదానంలో నిన్ను చూసిన సంతోషంలో వచ్చిన చిరునవ్వు అది' అని గంభీర్ బదులిచ్చాడు. ఎప్పుడూ సీరియస్‌గా కనిపించే టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. టీ20 ప్రపంచకప్ విజయానంతరం నవ్వుతూ కనిపించాడు. ఈ విజయానంతరం అర్ష్‌దీప్ సింగ్ సైతం.. 'గౌతమ్ పాజీ ఇకనైనా నవ్వండి' అని రీల్ చేశాడు. హెడ్ కోచ్‌గా ఎన్నో విమర్శలు ఎదుర్కొన్న గంభీర్.. తన హయాంలో వరుసగా రెండో ఐసీసీ ట్రోఫీని దేశానికి అందించాడు. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఈ ఫైనల్‌కు మహేంద్ర సింగ్ ధోనీ హాజరయ్యాడు. మ్యాచ్‌కు ముందు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి ట్రోఫీని మైదానంలోకి తీసుకొచ్చాడు. దిగ్గజ కెప్టెన్ కపిల్ దేవ్ కూడా ఈ మ్యాచ్‌కు హాజరవ్వడం విశేషం.



# తిలక్ వర్మకు తెలంగాణ 'సర్కారీ ఉద్యోగం'!

తెలంగాణకు చెందిన స్టార్ బ్యాటర్ తిలక్ వర్మకు కూడా కాంగ్రెస్ సర్కార్ నుంచి భారీ బహుమతి లభించనున్నట్లు క్రీడా వర్గాల్లో వార్తలు షికారు చేస్తున్నాయి. హైదరాబాద్ నుంచి టీ20 ప్రపంచకప్ విజయంలో భాగమైన తిలక్ వర్మ, సిరాజ్‌లను తెలంగాణ ప్రభుత్వం ఘనంగా సన్మానించనున్నట్లు తెలుస్తోంది. సిరాజ్‌కు గతంలోనే భారీ రివార్డ్ ప్రకటించిన నేపథ్యంలో తిలక్ వర్మకు ఈ సారి భారీ నజరానాతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వనున్నట్లు సమాచారం. ప్రస్తుతానికి ఈ విషయాలు అధికారికంగా వెల్లడి కాకపోయినా.. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. తిలక్‌కు ప్రభుత్వ ఉద్యోగంతో పాటు క్యాష్ ప్రైజ్, ఇంటి స్థలంను బహుమతిగా అందజేయనున్నారని టాక్ వినిపిస్తోంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024 గెలిచిన భారత జట్టులో భాగంగా ఉన్న సిరాజ్‌కు తెలంగాణ సర్కార్ డీఎస్పీ ఉద్యోగంతో పాటు జూబ్లీహిల్స్‌లో 600 గజాల నివాస స్థలాన్ని బహుమతిగా అందజేసింది. తిలక్ వర్మకు కూడా గ్రూప్-1 ఉద్యోగంతో పాటు ఇంటి స్థలం బహుమతిగా అందజేయవచ్చని స్పోర్ట్స్ సర్కిల్స్‌లో చర్చ జరుగుతోంది.

# ఉద్దేర బ్యాటుతోనే అభిషేక్ విధ్వంసం!



టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్లో భారత్ చారిత్రక విజయం సాధించడంలో యువ కెరటం అభిషేక్ శర్మ కీలక పాత్ర పోషించాడు. గత కొన్ని మ్యాచ్‌లుగా ఫామ్ లేక ఇబ్బంది పడుతున్న ఈ యువ సెన్సేషన్.. ఫైనల్ మ్యాచ్‌లో మాత్రం అద్భుతమైన ఇన్నింగ్స్‌తో చెలరేగిపోయాడు. అయితే అభిషేక్ శర్మ ఈ మెరుపు ఇన్నింగ్స్ వెనుక ఓ ఆసక్తికరమైన రహస్యం ఉందని మ్యాచ్ తర్వాత వెల్లడైంది. ఫైనల్ మ్యాచ్‌కు ముందు వరకు అభిషేక్ శర్మ తన ఫామ్‌ను అందుకోవడానికి తీవ్రంగా శ్రమించాడు. వరుసగా విఫలమవుతున్న తరుణంలో మ్యాచ్ రోజు ఉదయం అభిషేక్ శర్మ ఓ కీలక నిర్ణయం నిర్ణయం తీసుకున్నాడు. 'ఈరోజు ఏదైనా కొత్తగా ప్రయత్నించాలనిపించింది. అందుకే శివం దూబే దగ్గరికి వెళ్లి అతని బ్యాటును అడిగి తీసుకున్నాను' అని అభిషేక్ మ్యాచ్ తర్వాత బయటపెట్టాడు. శివం దూబే బ్యాటుతో బరిలోకి దిగిన అభిషేక్, కివీస్ బౌలర్లను ఉతికి ఆరేశాడు. తన ఫామ్ గురించి అభిషేక్ శర్మ మాట్లాడుతూ.. 'గత నెల రోజులుగా నేను కఠినమైన పరిస్థితులను ఎదుర్కొన్నాను. కానీ నా చుట్టూ ఉన్న టీమ్ సభ్యులు నాపై ఉంచిన నమ్మకం నాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది. నేను ఫెయిల్ అయినప్పుడు కూడా అందరూ నాపై నమ్మకం ఉంచారు. ఆ నమ్మకమే ఈరోజు నేను రాణించేలా చేసింది' అని తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు.



# పొండాటికి అంకితం: సంజూ

భారత జట్టు టీ20 ఛాంపియన్ గా నిలవడంలో సంజూ శాంసన్ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. కీలకమైన నాకౌట్, సెమీస్ మ్యాచులో అద్భుత ప్రదర్శన కనబరిచి.. ఫైనల్ జట్టులో సైతం చోటు దక్కించుకున్నాడు. అలాగే ఆదివారం న్యూజిలాండ్ జట్టుతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సైతం భారీ స్కోర్ చేసి సంజూ శాంసన్ కీలకంగా మారాడు. దీంతో అతనికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డులను సైతం దక్కించుకున్నాడు. ఈ చారిత్రాత్మక విజయాన్ని తన భార్య చారులత రమేష్‌కు అంకితం చేస్తూ పెట్టిన పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ఈ టోర్నీలో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ గా నిలిచి భారత్ కప్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన సంజూ, తన విజయ ప్రస్థానం లో భార్య అందించిన మద్దతును గుర్తుచేసుకుంటూ అత్యంత భావోద్వేగానికి లోనయ్యారు. 'నిన్ను కలిసిన మొదటి రోజు నుంచి ఈ క్షణం వరకు.. ప్రతి అడుగులో నాకు తోడుగా నిలిచినందుకు ధన్యవాదాలు. బయటి ప్రపంచం నన్ను ఎలా చూసినా, నాలోని మంచిని, చెడును సమానంగా స్వీకరించి నన్ను ప్రేమించావు. నా జీవితంలో క్రికెట్ అంటే ఎంత ప్రాణమో గుర్తించి, నా కలలను నీ కలలుగా మార్చుకున్నావు. ఈ అద్భుత క్షణం కోసం నేను ఎంతగా తపించానో, నువ్వు కూడా అంతే ఆరాటపడ్డావు. థాంక్యూ మై డియర్ పొండాటి (భార్య)' అంటూ సంజూ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

# టీమిండియాకు బీసీసీఐ అభినందనలు

2026 ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకున్న భారత జట్టుపై భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ (బీసీసీఐ) ప్రశంసల వర్షం కురిపించింది. వరుసగా రెండోసారి ఈ టైటిల్‌ను గెలిచి చరిత్ర సృష్టించిన



టీమిండియాను మనస్ఫూర్తిగా అభినందించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల భారీ తేడాతో భారత్ ఘనవిజయం సాధించింది. కిక్కిరిసిన స్టేడియంలో సొంత అభిమానుల మధ్య టైటిల్‌ను ముద్దాడి, దేశవ్యాప్తంగా కోట్లాది మందికి చిరస్మరణీయమైన ఆనందాన్ని పంచింది. టీ20 వరల్డ్ కప్ ను మూడుసార్లు నెగ్గిన జట్టుగానూ టీమిండియా చరిత్ర సృష్టించింది. ఈ విజయంతో టీమిండియా రెండు చారిత్రక ఘనతలను సొంతం చేసుకుంది. టీ20 ప్రపంచకప్ చరిత్రలో టైటిల్‌ను నిలబెట్టుకున్న తొలి జట్టుగా నిలిచింది.

## 10సెకన్ల యాడ్‌కు రూ.50 లక్షలు

టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్ న్యూజిలాండ్‌పై భారీ విజయం సాధించి టోర్నీని కైవసం చేసుకున్నది. కాగా బ్రాడ్‌కాస్టర్ జియోస్టార్ మ్యాచ్ సమయంలో 10 సెకన్ల కమర్షియల్ యాడ్ కోసం ఏకంగా రూ. 50 లక్షల వరకు వసూలు చేసినట్లు యాడ్ ఎగ్జిక్యూటివ్‌లు తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌కు ఉన్న ఆదరణను చూసే కోట్లాది కస్టమర్లను చేరేందుకు బ్రాండ్ల మధ్య పోటీ తీవ్రం కావడంతో యాడ్స్‌కు ఈ స్థాయి ధర పలికింది. టీవీలు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఎక్కువమంది యూజర్లను ఆకర్షించవచ్చని కంపెనీలు భావిస్తున్నాయి.

## ఫైనల్‌లో లక్ష్యసేన్ ఓటమి

భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. ప్రతిష్టాత్మక ఆల్‌ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీలో టైటిల్ నెగ్గాలన్న అతడి ఆశలు మరోసారి అడియాసలే అయ్యాయి. 2022లో ఫైనల్ చేరి తుది మెట్టు వద్ద తడబడిన లక్ష్య.. ఆదివారం ముగిసిన 2026 ఎడిషన్ ఫైనల్‌లోనూ ఓడి రన్నరప్‌గా నిలిచాడు. ఫైనల్‌లో 24 ఏండ్ల లక్ష్య.. 15-21, 20-22తో చైనీస్ తైపీ ఆటగాడు లిన్ చున్-యి చేతిలో ఓడిపోయాడు. టోర్నీ ఆసాంతం రాణించిన సేన్.. 57 నిమిషాల పాటు జరిగిన తుదిపోరులో మాత్రం ఆ స్థాయి ప్రదర్శన చేయలేకపోయాడు.

# స్విస్ ఓపెన్ నుంచి సింధు ఔట్

## లక్ష్య సేన్ కూడా డౌటే



ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఆడలేకపోయిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు కీలక నిర్ణయం తీసుకుంది. తీవ్ర భయాందోళన మధ్య దుబాయ్ నుంచి స్వదేశం వచ్చిన సింధు.. స్విస్ ఓపెన్‌లోనూ ఆడకూడదని తీర్మానించుకుంది. మూడు రోజుల దుబాయ్‌లో బిక్కుబిక్కుమంటూ గడిపిన తను.. మానసికంగా, శారీరకంగా సన్నద్ధంగా లేనందునే స్విస్ ఓపెన్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్టు పేర్కొంది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా దుబాయ్‌లో చిక్కుకున్న పీవీ సింధు ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు దూరమైంది. మూడు రోజుల తర్వాత స్వదేశం చేరుకున్న తెలుగు తేజం ఇంకా కుదురుకోలేదు. దాంతో.. వెంటనే కోర్టులోకి దిగేందుకు ఆమె సిద్ధంగా లేదు. సో.. స్విట్జర్లాండ్ ఓపెన్ టోర్నమెంట్ నుంచి వైదొలగాలని సింధు నిర్ణయించుకుంది. రెండోసారి కూడా ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో కంగుతిన్న లక్ష్య సేన్ సైతం ఈ పోటీల్లో ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. మార్చి 10 నుంచి మొదలయ్యే ఈ ఈవెంట్‌కు తాను అందుబాటులో ఉండదని ఆమె తెలిపింది. స్విట్జర్లాండ్‌లోని సెయింట్ జకొబ్‌షల్లేలో మార్చి 10వ తేదీ నుంచి మార్చి 15 వరకూ స్విస్ ఓపెన్ జరుగనుంది.

ఈవార్తలు
# ప్రజావాణి
మంగళవారం 10-3-2026
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు

సంపాదకీయం

Editorial

## టీ20 క్రికెట్‌లో అప్రతిహత ఆధిపత్యం

భారత క్రికెట్ చరిత్రలో మరో సువర్ణ అధ్యాయం చేరింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి, టీమిండియా ముచ్చటగా మూడోసారి టీ20 ప్రపంచ కప్‌ను ముద్దాడింది. ఈ విజయం కేవలం ఒక ట్రోఫీ గెలవడం మాత్రమే కాదు, అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో భారత జట్టు తిరుగులేని శక్తి అని ప్రపంచానికి చాటిచెప్పింది. టీ20 ప్రపంచ కప్ చరిత్రలో వరుసగా రెండుసార్లు టైటిల్ గెలిచిన తొలి జట్టుగా భారత్ రికార్డు సృష్టించింది. మూడు టీ20 ప్రపంచ కప్‌లు (2007, 2024, 2026) సాధించి, అత్యధిక సార్లు ఛాంపియన్‌గా నిలిచిన జట్టుగా అవతరించింది. 2010 నుంచి ఫైనల్‌లో టాస్ ఓడిన జట్టు గెలవలేదన్న సెంటిమెంట్‌ను తుడిచివేస్తూ, టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసినా భారత్ భారీ స్కోరు సాధించి విజయం సాధించింది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో భారత జట్టు ప్రదర్శించిన సమష్టి కృషి, పట్టుదల ఈ విజయానికి పునాది వేసింది. ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ములతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ దిగ్గజాలు టీమిండియాను అభినందనలతో ముంచెత్తారు. ఈ విజయం కోట్లాదిమంది భారతీయుల్లో నూతనోత్తేజాన్ని నింపడమే కాకుండా, రాబోయే 2028 ఒలింపిక్స్‌లో పతకం సాధించే దిశగా బలమైన పునాదిగా మారింది.

# భారత్- కెనడా కొత్త సమీకరణాలు

**కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ 2026 ఫిబ్రవరి 27 నుండి మార్చి 2 వరకు భారత్‌కు చేసిన కీలక పర్యటన ఇటీవల ముగిసింది. ఈ పర్యటన ముంబై అనే భారత ఆర్థిక రాజధానిలో వ్యాపార నేతలతో జరిగిన ప్రత్యక్ష సంభాషణలతో ప్రారంభమై, తరువాత న్యూఢిల్లీ విధాన కేంద్రాల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో జరిగిన చర్చలతో కొనసాగింది. ఈ పర్యటన కేవలం ప్రతీకాత్మకమైనది కాదు. ఇది వాణిజ్య దృష్టితో కూడినది. భవిష్యత్ అవకాశాలను దృష్టిలో పెట్టుకున్నది. ప్రపంచ ఆర్థిక వాస్తవాల్లో అత్యంత కీలకమైన అంశంగా మారుతున్న భారత అభివృద్ధి కథను గుర్తించిన నేపథ్యంలో ఈ పర్యటన జరిగింది.**



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

చాలా కాలంగా కెనడా-భారత్ సంబంధాలు అప్పుడప్పుడు ఉత్పన్నమయ్యే ఉద్రిక్తతలు, ప్రతిస్పందనాత్మక దౌత్యంతోనే నిర్వచించబడ్డాయి. ఈ పర్యటనతో అత్యున్నత స్థాయిలో రాజకీయ సంకల్పం మళ్లీ పునరుద్ధరించబడింది. వాణిజ్యానికి కొత్త అవకాశాలు తెరుచుకున్నాయి. అయినప్పటికీ అవకాశాలు ఉన్నంత మాత్రాన అవి స్వయంగా ఉద్యోగాలు, ఎగుమతులు లేదా పెట్టుబడులుగా మారవు. ఆ లక్ష్యాలు సాధించాలంటే రెండు దేశాల తరపున కూడా దీర్ఘకాలిక నిబద్ధతతో కూడిన చర్యలు అవసరం. కెనడా, భారత్ కంపెనీలకు ద్వైపాక్షికంగా పెద్ద అవకాశాలు ఉన్నాయి. ఈ పర్యటనలో అత్యంత ప్రాముఖ్యమైన ఘట్టాలలో ఒకటి "టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్"పై అధికారిక సంతకం. దీని ద్వారా సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) చర్చలు అధికారికంగా మళ్లీ ప్రారంభమయ్యాయి. ఈ ఒప్పందాన్ని 2026 చివరి నాటికి పూర్తి చేయాలని రెండు ప్రభుత్వాలు లక్ష్యంగా నిర్ణయించాయి. తరువాత 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 70 బిలియన్ డాలర్లకు రెట్టింపు చేయాలని కూడా సంకల్పించాయి. ఇది భారత వ్యాపార రంగానికి అత్యంత ప్రాధాన్యమైన విషయం. సీఈపీఏ అమలులోకి వస్తే భారత ఎగుమతిదారులకు ఉన్న అడ్డంకులు తగ్గుతాయి. కెనడాలో పెట్టుబడులు పెట్టే భారత కంపెనీలకు స్పష్టమైన నియమాలు ఏర్పడతాయి. సాంకేతికత నుండి ఔషధ రంగం వరకు అనేక రంగాల్లో మార్కెట్ అవకాశాలు విస్తరిస్తాయి. అలాగే కెనడా ద్వారా ఉత్తర అమెరికా మార్కెట్‌లోకి ప్రవేశించడానికి భారత సంస్థలకు స్థిరమైన నియమబద్ధ ఆర్థిక వేదిక లభిస్తుంది. అయినప్పటికీ టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌పై సంతకం చేయడం ప్రారంభ దశ మాత్రమే; అది అంతిమ గమ్యం కాదు. వాణిజ్య ఒప్పందాలు ఒక నిర్మాణాన్ని సృష్టిస్తాయి. కానీ అవి స్వయంగా మార్కెట్ వాటాను పెంచవు. ప్రస్తుతం ఏర్పడిన కొత్త రాజకీయ అనుసంధానం రెండు దేశాల కంపెనీలు భాగస్వామ్యాలు ఏర్పాటు చేయడానికి, పెట్టుబడులు పెట్టడానికి, సంయుక్త సంస్థలను నిర్మించడానికి అనుకూల పరిస్థితులను కల్పించింది. ఈ సహకారం ఇప్పటికే కొన్ని కీలక రంగాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఉదాహరణకు భారత ప్రభుత్వం, కేమెకో సంస్థ మధ్య కుదిరిన 2.6 బిలియన్ కెనడియన్ డాలర్ల విలువైన తొమ్మిది సంవత్సరాల యురేనియం సరఫరా ఒప్పందం ఒక చారిత్రక ఘట్టం. అణుఊర్జా రంగంలో సహకారం కోసం అత్యంత స్థాయి నియంత్రణ విశ్వాసం, దీర్ఘకాలిక కట్టుబాటు అవసరం. రాజకీయ నాయకత్వం, వాణిజ్య సిద్ధత కలిసి పనిచేసినప్పుడు ఎంత పెద్ద మార్పులు సాధ్యమవుతాయో ఈ ఒప్పందం చూపిస్తుంది.

శక్తి వనరులు, కీలక ఖనిజాలు రెండు దేశాల మధ్య సహజ అనుసంధానాన్ని అందించే ప్రధాన రంగాలు. బాధ్యతాయుతంగా ఉత్పత్తి చేయబడిన చమురు, సహజ వాయువు, పరిశుభ్రమైన అణుఊర్జా కోసం అవసరమైన యురేనియం, ఎలక్ట్రిక్ వాహనాలు, ఆధునిక తయారీ రంగాలకు అవసరమైన కీలక ఖనిజాలను కెనడా సరఫరా చేయగలదు. మరోవైపు భారతదేశం విస్తారమైన మార్కెట్ కావడం వల్ల దీర్ఘకాలిక డిమాండ్‌కు భరోసా ఇస్తుంది. అదే సమయంలో భారత కంపెనీలు కూడా కెనడాలో తమ కార్యకలాపాలను విస్తరించడానికి మంచి అవకాశాలు ఉన్నాయి. భారత సాంకేతిక రంగం ప్రపంచవ్యాప్తంగా పోటీ సామర్థ్యాన్ని కలిగి ఉంది. హెచ్‌సీఎల్, టెక్ మహీంద్రా వంటి సంస్థలు ఇటీవల కెనడా నవీనతా వ్యవస్థలో పెట్టుబడులు పెట్టడం ప్రారంభించాయి. ఉత్తర అమెరికా మార్కెట్‌కు ప్రవేశం, బలమైన కృత్రిమ మేధస్సు పరిశోధన కేంద్రాలు, స్థిరమైన నియంత్రణ వ్యవస్థ, పరిశుభ్రమైన శక్తి వనరులు కెనడాను సహజ భాగస్వామిగా నిలబెడుతున్నాయి. ఆర్థిక సేవల రంగంలో కూడా దీర్ఘకాలిక సంయుక్త సంస్థలు ఉన్నాయి. సన్ లైఫ్--ఆదిత్య బిర్లా వంటి భాగస్వామ్యాలు రెండు దేశాల మధ్య సహకారం ఎంత బలంగా కొనసాగుతోందో చూపిస్తున్నాయి. వ్యవసాయ రంగం కూడా మరో ముఖ్య అవకాశం అందిస్తుంది. కెనడా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు భారత ఆహార భద్రత, స్థిరత్వ అవసరాలను పూరించడంలో సహకరించగలవు. ఇంకా ఒక ముఖ్యమైన అవకాశం కెనడా సంస్థాగత పెట్టుబడిదారులు, పెన్షన్ ఫండ్లకు ఉంది. ఇవి ఇప్పటికే భారత మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్ అభివృద్ధిలో 100 బిలియన్ కెనడియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయి. ఫెయిర్‌ఫ్యాక్స్ ఇండియా బెంగళూరు విమానాశ్రయ అభివృద్ధిలో పెద్ద పెట్టుబడులు పెట్టింది. బ్రూక్‌ఫీల్డ్ టెలికాం టవర్ల నుండి పునరుత్పాదక శక్తి ప్రాజెక్టుల వరకు అనేక రంగాల్లో పెట్టుబడులు పెట్టింది.



భారతదేశంలో నగరీకరణ వేగంగా జరుగుతోంది. లాజిస్టిక్స్ కారిడార్లు, పునరుత్పాదక శక్తి నిర్మాణం, పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి నిరంతర పెట్టుబడులు అవసరం. ఆ పెట్టుబడులను కెనడా అందించగలదు. అదే సమయంలో భారత మౌలిక సదుపాయాలు, సాంకేతిక సంస్థలు కూడా కెనడాలో డిజిటల్ మౌలిక సదుపాయాలు, పరిశుభ్రమైన శక్తి రంగాలు, ఆధునిక తయారీ రంగాల్లో అవకాశాలను పొందగలవు. మార్క్ కార్నీ, నరేంద్ర మోదీని కెనడా పర్యటనకు ఆహ్వానించారు. ఈ భాగస్వామ్యం పరస్పరంగా, దీర్ఘకాలికంగా కొనసాగుతుందనే సంకేతం ఇది. ప్రస్తుతం ఒక కొత్త అవకాశాల ద్వారం తెరుచుకుంది. భారతదేశం ఇప్పటికే ఆస్ట్రేలియా, యునైటెడ్ కింగ్‌డమ్, న్యూజిలాండ్, యూరోపియన్ యూనియన్, యునైటెడ్ స్టేట్స్ వంటి విశ్వసనీయ భాగస్వామ్య దేశాలతో వాణిజ్య ఒప్పందాలను కొనసాగిస్తోంది. మరోవైపు ప్రపంచ భౌగోళిక రాజకీయ అనిశ్చితుల మధ్య కెనడా కూడా తన ఆర్థిక భాగస్వామ్యాలను విస్తరిస్తోంది. ఈ పరిస్థితుల్లో భారత్‌తో సన్నిహిత ఆర్థిక అనుసంధానం వ్యూహాత్మకంగా కూడా ఎంతో ముఖ్యమైనది. ప్రపంచం మారుతున్న ఈ సమయంలో కెనడా, భారతదేశాల ఆర్థిక భవిష్యత్తుకు ఇది ఒక నిర్ణాయక దశ. మారుతున్న ప్రపంచ పరిస్థితులు, పునరుద్ధరించబడిన రాజకీయ సంకల్పం ఈ అవకాశాన్ని రూపొందించాయి. ఇప్పుడు ఈ అవకాశాన్ని కార్యాచరణ, దృఢ సంకల్పం, వ్యాపార దృష్టితో కంపెనీలు సద్వినియోగం చేసుకోవాల్సిన సమయం వచ్చింది.

కెనడా-భారత్ ఆర్థిక సంబంధాల తాజా పరిణామాలు ప్రపంచ రాజకీయ-ఆర్థిక వ్యవస్థలో ఏర్పడుతున్న మార్పులను స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. 21వ శతాబ్దంలో అంతర్జాతీయ సంబంధాలు కేవలం రాజకీయ లేదా దౌత్య పరిమితుల్లోనే ఉండడం లేదు; ఆర్థిక పరస్పర ఆధారితత, సాంకేతిక పరిజ్ఞానం, వనరుల వినియోగం, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలు దేశాల మధ్య సంబంధాలను నిర్ణయించే ప్రధాన కారకాలుగా మారాయి. ఈ నేపథ్యంలో కెనడా, భారత్ మధ్య ఏర్పడుతున్న కొత్త ఆర్థిక అనుసంధానం రెండు దేశాలకే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కూడా ప్రాధాన్యమైనదిగా కనిపిస్తోంది. భారతదేశం గత రెండు దశాబ్దాల్లో ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత ప్రారంభమైన ఆర్థిక విస్తరణ 2000 తర్వాత మరింత వేగం సాధించింది. 2023 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. అనేక అంతర్జాతీయ సంస్థల అంచనాల ప్రకారం 2030 నాటికి భారత్ ప్రపంచంలో 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారే అవకాశాలు ఉన్నాయి. ఈ విస్తృత ఆర్థిక సామర్థ్యం కారణంగా ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాలు భారత్‌తో వ్యాపార సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి ఆసక్తి చూపుతున్నాయి. కెనడా కూడా ఈ కొత్త ఆర్థిక వాస్తవాన్ని గుర్తించిన దేశాల్లో ఒకటి. విస్తారమైన సహజ వనరులు, ఆధునిక సాంకేతిక సామర్థ్యం, స్థిరమైన ఆర్థిక వ్యవస్థ కలిగిన కెనడా ప్రపంచ మార్కెట్‌లో కీలక పాత్ర పోషిస్తోంది. అయితే కెనడా ఆర్థిక వ్యవస్థకు కొత్త మార్కెట్లు, స్థిరమైన వాణిజ్య భాగస్వామ్యాలు అవసరం. ఈ అవసరానికి భారతదేశం ఒక సహజ భాగస్వామిగా నిలుస్తోంది. భారత్‌లో పెరుగుతున్న మధ్యతరగతి, వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలు, విస్తరించుతున్న పారిశ్రామిక రంగం, పెరుగుతున్న శక్తి అవసరాలు కెనడా వంటి వనరుల సమృద్ధి దేశాలకు పెద్ద అవకాశాలను అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) చర్చల పునఃప్రారంభం ఒక కీలక దశగా చెప్పవచ్చు. ఒక సమగ్ర వాణిజ్య ఒప్పందం కేవలం దిగుమతి-ఎగుమతుల పరిమితిలో ఉండదు; పెట్టుబడులు, సేవల రంగం, సాంకేతిక సహకారం, మేధో సంపత్తి హక్కులు, డిజిటల్ వాణిజ్యం వంటి అనేక అంశాలను కూడా ఇది ప్రభావితం చేస్తుంది. అందువల్ల సీఈపీఏ అమలులోకి వస్తే రెండు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలు మరింత విస్తృత స్థాయికి చేరే అవకాశం ఉంది.

శక్తి రంగం ఈ భాగస్వామ్యంలో అత్యంత కీలకమైన అంశంగా నిలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా శక్తి అవసరాలు వేగంగా పెరుగుతున్నాయి. అంతర్జాతీయ శక్తి సంస్థ అంచనాల ప్రకారం 2040 నాటికి ప్రపంచ శక్తి వినియోగం సుమారు 30% వరకు పెరగవచ్చు. ఈ పెరుగుదలలో భారతదేశం ఒక ప్రధాన పాత్ర పోషించనుంది. భారత్‌లో పరిశ్రమల విస్తరణ, నగరీకరణ, రవాణా రంగ అభివృద్ధి కారణంగా శక్తి వినియోగం వేగంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కెనడా వంటి దేశాల నుండి చమురు, సహజ వాయువు, యురేనియం వంటి వనరుల సరఫరా భారత శక్తి భద్రతకు సహకరించగలదు. అదే సమయంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం మరో ముఖ్యమైన మార్పు జరుగుతోంది. శుభ్రమైన శక్తి, ఎలక్ట్రిక్ వాహనాలు, అధునాతన తయారీ రంగాల అభివృద్ధి కోసం అవసరమైన కీలక ఖనిజాల ప్రాధాన్యం పెరుగుతోంది. లిథియం, కోబాల్ట్, నికెల్ వంటి ఖనిజాలు భవిష్యత్ పారిశ్రామిక వ్యవస్థకు కీలకంగా మారుతున్నాయి. ఈ ఖనిజాలలో కెనడాకు ఉన్న వనరులు భారత పారిశ్రామిక అభివృద్ధికి మద్దతు ఇవ్వగలవు. మరోవైపు భారత పరిశ్రమల విస్తరణ కెనడాకు స్థిరమైన మార్కెట్‌ను అందిస్తుంది. సాంకేతిక రంగం కూడా ఈ భాగస్వామ్యంలో ఒక కీలక అక్షంగా ఎదుగుతోంది. భారత ఐటీ పరిశ్రమ ప్రపంచంలో అత్యంత ప్రభావవంతమైన సేవా రంగాలలో ఒకటి. 2024 నాటికి భారత ఐటీ పరిశ్రమ విలువ సుమారు 250 బిలియన్ డాలర్లకు చేరినట్లు అంచనా. ఈ రంగంలో పనిచేస్తున్న లక్షలాది నిపుణులు ప్రపంచవ్యాప్తంగా సేవలను అందిస్తున్నారు. కెనడాలో అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధస్సు పరిశోధన కేంద్రాలు, స్టార్టప్ వ్యవస్థ, విశ్వవిద్యాలయ పరిశోధన వేదికలు భారత ఐటీ సంస్థలకు సహజ భాగస్వామ్య అవకాశాలను అందిస్తున్నాయి. మౌలిక సదుపాయాల రంగం మరో ప్రధాన అవకాశంగా నిలుస్తోంది. భారతదేశంలో నగరీకరణ వేగంగా జరుగుతోంది. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం 2035 నాటికి భారత నగరాల్లో నివసించే జనాభా మొత్తం జనాభాలో సుమారు 43% వరకు పెరిగే అవకాశం ఉంది. ఈ నగరీకరణకు అనుగుణంగా రవాణా వ్యవస్థలు, గృహ నిర్మాణం, పారిశ్రామిక పార్కులు, డిజిటల్ మౌలిక సదుపాయాలు వంటి అనేక రంగాల్లో భారీ పెట్టుబడులు అవసరం. ఈ పెట్టుబడుల్లో కెనడా సంస్థాగత పెట్టుబడిదారులు కీలక పాత్ర పోషించగలరు.

అంతేకాకుండా ఈ ఆర్థిక భాగస్వామ్యం కేవలం రెండు దేశాల మధ్య వ్యాపార సంబంధాలకే పరిమితం కాదు. ఇది ప్రపంచ భౌగోళిక రాజకీయ సమీకరణాల్లో కూడా ఒక కొత్త దిశను సూచిస్తుంది. ప్రపంచ రాజకీయ వ్యవస్థలో ప్రస్తుతం అనేక మార్పులు జరుగుతున్నాయి. సరఫరా గొలుసుల పునర్వ్యవస్థీకరణ, కొత్త వాణిజ్య కూటముల నిర్మాణం, ప్రాంతీయ ఆర్థిక సహకార వ్యవస్థల అభివృద్ధి వంటి పరిణామాలు దేశాలను కొత్త భాగస్వామ్యాల కోసం ప్రోత్సహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్య విలువలు, పారదర్శక ఆర్థిక వ్యవస్థలు కలిగిన దేశాల మధ్య సహకారం మరింత ప్రాధాన్యం పొందుతోంది. అందువల్ల కెనడా-భారత్ ఆర్థిక అనుసంధానం భవిష్యత్‌లో మరింత విస్తరించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

అయితే ఈ అవకాశాలు పూర్తిగా ఫలితాలను ఇవ్వాలంటే కొన్ని ముఖ్యమైన అంశాలపై దృష్టి పెట్టాలి. విధాన స్థిరత్వం, పెట్టుబడులకు అనుకూల వాతావరణం, వాణిజ్య అడ్డంకుల తగ్గింపు, సాంకేతిక సహకారం, మానవ వనరుల అభివృద్ధి వంటి అంశాలు ఈ భాగస్వామ్య విజయానికి కీలకం. చివరగా చెప్పాలంటే, మారుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కెనడా, భారత్ మధ్య ఏర్పడుతున్న కొత్త ఆర్థిక భాగస్వామ్యం ఒక కీలక మలుపుగా చెప్పవచ్చు. ఇది కేవలం వాణిజ్య సంబంధం మాత్రమే కాదు; దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలను పంచుకునే వ్యూహాత్మక భాగస్వామ్యం. సరైన విధానాలు, దృఢమైన రాజకీయ సంకల్పం, వ్యాపార రంగ చురుకుదనం కలిసి పనిచేస్తే ఈ భాగస్వామ్యం రాబోయే దశాబ్దాల్లో ప్రపంచ ఆర్థిక పటంలో ఒక శక్తివంతమైన అక్షంగా ఎదగగలదు. ఈ అవకాశాన్ని కార్యాచరణగా మలచడం ఇప్పుడు రెండు దేశాల ప్రభుత్వాలు, పరిశ్రమలు, పెట్టుబడిదారుల ముందున్న ప్రధాన బాధ్యతగా నిలుస్తోంది.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.